

# మహబూబ్‌నగర్ వార్త

నాగర్‌కర్నూల్ / వనపర్తి / జోగుళాంబ గద్వాల/నారాయణపేట


### మహిళలు,యువతులు ఎలాంటి సమస్య ఉన్న

## నిర్భయంగా పోలీసులను సంప్రదించండి

**-మహిళల రక్షణ కొరకే షీ టీం, యాంటి హ్యూమన్ ట్రాఫికింగ్ టీంలు**

**-నాగర్‌కర్నూల్ జిల్లా అడిషనల్ ఎస్పీ సీహెచ్.రామేశ్వర్**



**నాగర్‌కర్నూల్ ప్రతినిధి, డిసెంబర్ 16 ప్రభాతవార్త:** విద్యార్థినులు, మహిళలు అన్యాయానికి గురైన ప్పుడు భయపడొద్దని, ధైర్యంగా ముందుకు వచ్చి ఫిర్యాదు చేస్తే నిందితులపై కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా అడిషనల్ ఎస్పీ సీహెచ్.రామేశ్వర్ అన్నారు. జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు శనివారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల తుడుకుర్తి యాం టి హ్యూమన్ ట్రాఫికింగ్ హ్యూమన్ సేఫ్టీ, సైబర్ క్రైమ్, షీ టీం అనే అంశంపై సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా అడిషనల్ ఎస్పీ మాట్లాడుతూ మహిళలు మరియు చిన్న పిల్ల రక్షణ విషయంలో జిల్లా పోలీస్ శాఖ పటిష్టమైన చర్యలు చేపట్టడం జరిగిం దని తెలిపారు. మానవ అక్రమ రవాణాను నిర్మూలించడానికి యాంటీ హ్యూమన్ ట్రాఫి కింగ్ యూనిట్‌ను జిల్లాలో ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. మహిళలపై పెరిగి పోతున్న నేరాల విషయంలో చాలా అప్రమత్తంగా ఉండాలని, మహిళల భద్రత, ఆకతా యిల వేధింపుల నుంచి మహిళల రక్షణ కొరకు పోలీస్ శాఖ అధిక ప్రాధాన్యత నిస్తుందన్నారు. పోలీస్ శాఖ మహిళా భద్రత కొరకు షీటీమ్స్ ఏర్పాటు ద్వారా ఎన్నో రకాల కార్యక్రమాలు చేపడుతూ విద్యార్థినీలు, యువతులు, మహిళలకు అవగాహన కల్పిస్తూ నిరంతరం వారికి అందు బాటులో ఉంటుందన్నారు. మహిళలు, యువతులు ఎలాంటి సమస్యల ఉన్న నిర్భయంగా సంప్రదించాలని, నేరుగా సంప్రదించలేని వారు 100కు లేదా షీటీమ్ 87126 57676కు లేదా సంబంధిత పోలీస్‌స్టేషన్‌లో సమాచార మివ్వాలన్నారు. సమాచారమిచ్చిన వారి వివరాలను గోప్యంగా ఉంచుతామన్నారు. కార్యక్రమంలో షీ టీఎం ఏఎస్ఐ విజయలక్ష్మి, సభ్యులు వెంకటయ్య, వెంకట్‌నాయక్, మానవ అక్రమ రవాణా నిరోధక వ్యవస్థ సభ్యులు శ్రీనివాసులు, రవీందర్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు రమేష్, విద్యార్థుల తదితరులు ఉన్నారు.

## చెలరేగిపోతున్న దొంగలు

- తిమ్మినోనిపల్లి సంఘటన మరువక ముందే
- నారాయణపూర్‌లో 11 ఇండ్లలలో చోరీకి పాల్పడిన దొంగలు
- భయాందోళనలో మండల వాసులు



సంఘటన స్థలాన్ని పరిశీలిస్తున్న పోలీసులు, చోరీకి గురైన ఇంట్లో చిందరవందరగా ఉన్న సామాగ్రి

**వెల్దండ, డిసెంబర్ 16 ప్రభాతవార్త:** ఈ మధ్య కాలంలో మండలంలో రోజు రోజుకు దొంగల చెలరేగిపోతున్నారు. ఈ నెల 12వ తేదీ తిమ్మినోనిపల్లి గ్రామంలో తాళాలు వేసిన 7 ఇండ్లను గుర్తించి చోరీలకు పాల్పడిన సంఘటన మరువక ముందే నారాయణపూర్ గ్రామంలో శుక్రవారం తాళాలు వేసిన 11 ఇండ్లకు కన్నం వేశారు దొంగలు. గ్రామస్తులు... బాధితులు తెలిపిన వివరాల ప్రకారం గ్రామానికి చెందిన కొందరు తమ వ్యవసాయ పొలాలకు కావాలికి, మరికొందరు బంధువుల ఇండ్లకు వెళ్లారు. ఇదే అదునుగా భావించిన దొంగలు తాళాలు వేసిన ఇండ్లను గుర్తించి అర్ధరాత్రి తాళాలు పగుల గొట్టి ఇండ్లలో ఉన్న వస్తువులను దోచుకెళ్లారు. గ్రామానికి చెందిన నేనావత్ బిక్కి ఒక తులం బంగారం, 30 తులాల వెండి గొలుసులు, సంచిలో దాచి ఉన్న రూ.10వేల నగదు, ఇస్లావత్ జంగ్రీ క్వింటాల్ బియ్యం, నేనావత్ తారాసింగ్ రూ.5వేలు, రాత్లావత్ అచ్చాలుఅర్ధతులం బంగారు, చెవులకమ్మలు, రూ.10వేల నగదు, నారమ్మ రూ.10వేలు, దేరంగుల మల్లేష్ అర్ధతులం బంగారం, రూ.10వేల నగదు, శంకర్‌నాయక్, రాములు, జక్కుల బాలస్వామి, గౌండ్ల వెంకటమ్మ ఇండ్లలో చోరీకి యత్నించారు. అదే విధంగా పెద్దాపూర్ గ్రామ పంచాయతీలోని తుంకిబండతండాలో వద్యవత్ చత్రు, రవి ఇండ్లలో చోరీకి పాల్పడి రూ.30వేల నగదును ఎత్తుకెళ్లినట్లు బాధితులు పేర్కొన్నారు. శనివారం బాధితులు తమ ఇండ్ల వద్దకు రాగా తాళాలు పగులుగొట్టి తలుపులు తెరిచి ఉండటం, సామాగ్రి చిందరవందరగా పడి ఉండటంతో చోరీకి గురైనట్లు గుర్తించి బాధితులు లబోదిబోమన్నారు. సంఘటన స్థలాన్ని ఎస్ఐ శ్రీనివాస్ తన సిబ్బందితో కలిసి పరిశీలించారు. కాయకష్టం చేసి సంపాదించుకున్న సొమ్ములు, పైసలను అన్యాయంగా దొంగలు తీసుకెళ్లడంతో బాధితులు బోరున విలపిస్తున్నారు. మండలంలో రోజుకోసంఘటన చోటుచేసుకోవడంతో మండల ప్రజలు భయాందోళనకు గురవుతు న్నారు. పోలీస్ సర్కిల్‌ను పెంచి ప్రజలకు భరోసా కల్పించాల్సిన బాధ్యత పోలీసులపై ఉందని మండల వాసులు పేర్కొంటున్నారు.



రోధిస్తున్న బాధితురాలు నేనావత్ బిక్కి

## అరకొర గదులతో అధికారుల అవస్థలు

- కిక్కిరిసిన తహసీల్దార్ కార్యాలయ గదులు
- పట్టించుకోని పైఅధికారులు, ప్రజాప్రతినిధులు

**కొత్తకోట, డిసెంబర్ 16, ప్రభాతవార్త:** ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో అతి పెద్ద మేజర్‌గ్రామపంచాయతీ, మేజర్ మున్సిపాలిటీ, అన్ని రంగాల్లో ముందున్నది..కానీ తహశీల్దార్‌కార్యాలయం మాత్రం అరకొరగా చాలీచాలిని గదులతో ఫిర్యాదు దారులు, అర్జీదారులతో పాటు అధికారులు కూడా ఇబ్బందులకు గురవుతున్నారు. కొత్తకోట తహశీల్దార్ కార్యాలయంలో అరకొర గదులు ఉండడంతో అధికారులు సరిగ్గా పని చేయలేకపోతున్నారు. తహశీల్దార్ కార్యాలయంలో ఉన్నవి 5 గదులు..అందులో ఒక దాంట్లో ఇద్దరు రెవిన్యూ ఇన్స్పెక్టర్లు, ఒక సీనియర్ అసిస్టెంట్, ముగ్గురు జూనియర్ అసిస్టెంట్లు కలిసి పని చేస్తున్నారు. రెండో గదిలో డిప్యూటీ తహశీల్దార్ కు కేటాయించారు. మూడో గదిలో తహశీల్దార్‌తో కలిసి ధరణి కార్యకలాపాలు జరుగుతాయి. నాలుగో గదిలో పాత రికార్డ్‌లతో పాటు ముగ్గురు రికార్డ్ అసిస్టెంట్లు, ఒక జూనియర్ అసిస్టెంట్ కలిసి పని చేస్తారు. 5 గది కంప్యూటర్ గదిలో టైపిస్టు ఒకరు, ముగ్గురు జూనియర్ అసిస్టెంట్లు, ఒక సర్వేయర్ కలిసి పని చేస్తారు. ఏఎస్ఓ వస్తే ఒకరు బయటకు వెళ్ళాలి ఇది తహశీల్దార్ కార్యాలయంలో ఉన్న గదుల పరిస్థితి.. ఈ విషయం పై ఇప్పటి వరకు ఏ ప్రజాప్రతినిధి కానీ, పై అధికారులు కానీ పట్టించుకోకపోవడం విడ్డురంగా ఉంది. ప్రతి రోజు వందలాది ప్రజలు ఆయా పనుల నిమిత్తం తహశీల్దార్ కార్యాలయం దగ్గరకు వస్తుంటారు. లోపల స్థలం లేకపోవడంతో బయట చెట్టుకింద కూర్చొని పనులు చేయించుకొని వెళ్తున్నారు. ఇప్పుడన్న గదులు చిన్న గదులు అందులోకి నలుగురు వస్తే కార్యాలయం నిండుతుంది. అంతేకాక ప్రతిరోజు ధరణి భూ రిజిస్ట్రేషన్ కోసం చాలా మంది వస్తున్నారు వారికి కూడా స్థలం లేక ఇబ్బందులకు గురవుతున్నారు. ఇంత పెద్ద కార్యాలయంలో కంప్యూటర్లు ఉన్నవి నాలుగు, ఏ ధ్రువీకరణ పత్రం కావాలన్న మరి ఏది కావాలన్న ప్రతిదీ ఆన్లైన్ ద్వారానే చేయాలి ఇవ్వాలి ఇక్కడ సరైన గదులు లేక సరైన కంప్యూటర్లు లేక అధికారులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. కంప్యూటర్ ను ఒకరు వాడుకున్నకా మరొకరు వాడుకునే పరిస్థితి ఉందని అధికారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పుడైనా సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులు, చొరవ చూసి తహశీల్దార్ కార్యాలయాన్ని విస్తరించి సరైన గదులను ఏర్పాటు చేస్తే మరింత బాధ్యతగా పని చేస్తామని అధికారులు అంటున్నారు.



కొత్తకోట తహసీల్దార్ కార్యాలయంలో ఒకే గదిలో ఐదు మంది అధికారులు పని చేస్తున్న దృశ్యం

## అక్రమ ఇసుక రవాణాను అరికట్టాలి

**నారాయణపేట జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష**



అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ కోయ శ్రీహర్ష

**నారాయణపేట ప్రతినిధి, డిసెంబరు16 ప్రభాతవార్త:** జిల్లాలో ఇసుక అక్రమ రవాణాను సమర్థవంతంగా అరికట్టాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష ఆదేశించారు. ఇసుక అక్రమ రవాణాను నిరోధించడానికి శనివారం కలెక్టరేట్‌లోని విడియో కాన్ఫరెన్స్ హాల్లో ఏర్పాటు చేసిన డిఎల్ఎస్‌సి సమావేశంలో కలెక్టర్ కోయ శ్రీహర్ష, అదనపు జిల్లా కలెక్టర్లు మయాంక్ మిత్తల్, అశోక్‌కుమార్, జిల్లా ఎస్పీ యోగేష్ గౌతమ్‌తో కలిసి మాట్లాడారు. ఇసుక అక్రమ రవాణాను అరికట్టడానికి పోలీసు, రెవెన్యూ, గనులు, భూగర్భ జలాల శాఖ అధికారులతో 13 టాస్క్‌ఫోర్స్ బృందాలను ఏర్పాటు చేయాలని ఆయా మండలాల పరిధిలో ఎక్కడ ఇసుక అక్రమ రవాణా జరిగినా టాస్క్‌ఫోర్స్ బృందంలోని తహసిల్దార్‌లు, ఎస్ఐలు వెంటనే నియంత్రించి అరికట్టాలని సూచించారు. జిల్లాలో మన ఇసుక మన వాహనం ద్వారా చాలా సులభంగా ప్రజలు ఇసుకను తీసుకోవచ్చని, ప్రస్తుతం జిల్లాలో ఉన్న వర్కూరు, మాగనూరు రీచ్‌లతో పాటు జిల్లా ప్రజలకు మరింత అందుబాటులో ఇసుకను రవాణా చేసేందుకు కొత్తగా మక్తల్ మండలంలోని చిట్యాల, అడవి సత్యారం రీచ్‌లను ఏర్పాటు చేయాలని డిఎల్ఎస్‌సి ఛైర్మన్, జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష అధ్యక్షతన కమిటి తీర్మాణం చేసింది. అయితే అంతకు ముందు మైనింగ్ శాఖ ఏడి విజయ్‌కుమార్ మాట్లాడుతూ పట్టా భూముల్లో ఇసుకను తరలించడానికి డిఎల్ఎస్‌సి ఛైర్మన్ అనుమతి తీసుకోవాల్సి ఉంటుందని తెలిపారు. అలాగే ఇసుక అక్రమ రవాణాకు హాని కలిగించే పాయింట్లు అలాగే ఫిల్టర్ గుర్తించబడ్డాయని వాటిలో కృష్ణామండలం, టైరోడ్డు, చేగుంట, ముడుమాల్, మాగనూరు, మక్తల్, చిట్యాల, మాగనూరు, మందిపల్లి, నేరెడుగాం, ఉట్కూర్ మండలంలోని నాగిరెడ్డిపల్లి, మల్లేపల్లి, సమస్తాపూర్, నారాయణపేట మండలంలోని శాసన్‌పల్లి, పగిడిమర్రి, కోస్గి మండలాలలో లింగాల్చేడ్, పెద్దాపూర్, నందిగామ, మన్నాపూర్, ధన్వాడ మండలంలోని గోటూరు, రాకండ, మరికల్ మండలంలో ఎలిగండ్ల, జిన్నారం, చిత్తనూరు ఉన్నాయని వివరించారు. నీటి వసతి ఎక్కడ ఉంటుందో అక్కడే పిల్టర్ ఇసుక తయారు అవుతుందన్నారు. ఈ సందర్భంగా ఫిల్టర్ ఇసుక తయారు చేసే ప్రాంతాలను రాయల్టీ ఇన్స్‌పెక్టర్ రమేష్ పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా సమావేశంలో అధికారులకు చూపించారు. ఫిల్టర్ ఇసుక అక్రమార్కులు, ట్రాన్స్‌పోర్టర్లపై రెవెన్యూ, పోలీస్‌శాఖ కేసులు నమోదు చేయాలని, ఫిల్టర్ ఇసుక రవాణాదారులు/ వాహనాలపై వాల్టాచట్టం 2002, ఐపిసి ప్రకారం ఛైర్మన్, డిఎల్ఎస్‌సి ఆమోదంతో జరిమానా విధించడానికి అవసరమైన విధానాన్ని అనుసరించాలని మైనింగ్‌శాఖ ఏడి కోరరు. కాగా గ్రావెల్/ఎర్త్ స్థానిక అవసరాలు, కొనసాగుతున్న ప్రభుత్వ అవసరాలకు అనుగుణంగా గ్రావెల్ అనుమతుల జారీకోసం జిల్లా అడ్మినిస్ట్రేషన్ తహసిల్దార్లందరికి ఆదేశాలు జారీ చేసిందన్నారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో మన ఇసుక వాహనం (ఎంఐవి) పురోగతి సాధిస్తుందని, అవసరమైతే మన ఇసుక మన వాహనం ద్వారా సరఫరా చేస్తున్న ఇసుక ధరను తగ్గించేందుకు సిద్ధంగా ఉన్నట్లు తెలిపారు. జిల్లాలో మన ఇసుక వాహనం సీజీజీ సహకారంతో జిల్లా పరిపాలన ద్వారా క్రింది ప్రాంతాలలో ఆన్‌లైన్ మోడ్ ద్వారా నిర్వహించబడుతుందన్నారు. అవసరమైన ఆర్డర్లు, ట్రాక్టర్ యజమాని, కాంట్రాక్టర్‌లను పెంచడంద్వారా వినియోగదారుల మధ్య సమీకరణ పెరుగుతుందన్నారు. ఆర్డర్లు అవసరం నాసిరకం ఇసుక నాణ్యత ప్రాంతాన్ని మార్చాలని, కొత్త టిప్పర్లు, ట్రాక్టర్లు ఎంఐవి పోర్టల్‌లో నమోదు చేసుకోవాలని ఆయన సూచించారు. మన ఇసుక వాహనం పోర్టల్‌లో ప్రతి క్యూబిట్ మీటర్ విక్రయ ధర రూ.600లుగా నిర్ణయించబడిందని, ప్రతి క్యూబిక్ మీటర్ రేటును కమిటి ఆమోదించాలన్నారు. అలాగే ఇసుకతో ముడిపడి ఉన్న భూమిని స్థానికంగా బోధ్ ఇసుక అని పిలుస్తారని, మాగనూరు, మక్తల్ మండలాల్లో ఇది విస్తరించిందని కలెక్టర్ చెప్పారు. ఇది ఇటుక బట్టీ పరిశ్రమలో ఉపయోగపడుతుందని నిర్మాణానికి ఉపయోగపడదని, జిల్లాఅడ్మినిస్ట్రేషన్ ప్రతి టిప్పర్(10టైర్లు) ధర రూ.3000 గా నిర్ణయించింది. రేటు ధర కమిటీ ద్వారా ధృవీకరించబడుతుందని కలెక్టర్ తెలిపారు. సమావేశంలో ఎస్పీ యోగేష్ గౌతమ్ మాట్లాడుతూ ఇసుక రీచ్‌లను ఎప్పటికప్పుడు ఆయా పరిధిలోని సిఐలు, ఎస్సైలు పర్యవేక్షించాలని ఆదేశించారు. అయితే ఆన్‌లైన్ ద్వారా తరలిస్తున్న ఇసుకకు సంబంధించిన అనుమతి పత్రాలను తహసిల్దార్‌లు, ఎస్సైలకు కూడా పంపాలని సూచించారు. టాస్క్‌ఫోర్స్ బృందాలు ఏకకాలంలో తనిఖీలు చేయాలన్నారు. చివరగా సమావేశంలో రాయల్టీ ఇన్స్‌పెక్టర్ రమేష్ మన ఇసుక మన వాహనం ద్వారా ఇసుకను ఎలా పొందాలి? రీచ్‌ల నుంచి ఇసుకను తరలించే సమయం నుంచి ఇసుక యజమానికి చేరిన తర్వాత యజమాని సెల్‌ఫోన్‌కి వచ్చే సందేశం వరకు జరిగే ప్రక్రియను క్లుప్తంగా వివరించారు. ఈ సమావేశంలో జిల్లా పరిధిలోని సిఐలు, ఎస్సైలు, ఎక్సైజ్ శాఖ అధికారులు తదితరులు పాల్గొన్నారు.



హాజరైన అధికారులు

## లక్ష్యంతో చదివితే ఉన్నత శాఖరాలకు..

- ఫలితాలు ముఖ్యం కాదు గుణాత్మక విద్య కావాలి
- మహబూబ్‌నగర్ జిల్లా కలెక్టర్ రవినాయక్

**చిన్నచింతకుంట, డిసెంబరు 16 ప్రభాతవార్త:** విద్యార్థులు లక్ష్యంతో చదివితే ఉన్నత శిఖరాలకు చేరుకుంటారని జిల్లా కలెక్టర్ రవినాయక్ అన్నారు. శనివారం మండలంలోని లాల్‌కోట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఉమ్మడి మండలంలోని ఎనిమిది ప్రభుత్వ ఉన్నత పాఠశాల 10వ తరగతి విద్యార్థులకు ప్రేరణ తరగతుల కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ ఫలితాలు ముఖ్యం కాదని విద్యార్థులకు గుణాత్మక విద్య అందాలన్నదే తన అభిమతమని జిల్లా కలెక్టర్ అన్నారు. పదవ తరగతిలో చదివిన అంశాలే భవిష్యత్తులో ఉపయోగపడతాయన్నారు. చదువుకు పేదరికం అడ్డుకానే కాదని తాను కూడా మారుమూల తండాలో పుట్టి ప్రభుత్వ విద్యా సంస్థల్లోనే చదువుకుని అవరోధాలను అధిగమించి ఉన్నత స్థానానికి ఎదిగానని కలెక్టర్ అన్నారు. పరీక్షల్లో ఎవరో సహాయం చేస్తారనే భ్రమ నుండి విద్యార్థులు బయటపడి కష్టపడి చదివి ఉత్తీర్ణత సాధించాలని కలెక్టర్ సూచించారు. పదవ తరగతి పరీక్ష కేంద్రాల్లో ఎటువంటి అక్రమాలకు తావివ్వకుండా పరీక్షలను పకడ్బందీగా నిర్వహించేందుకు తాను అధికారులను ఆదేశిస్తున్నానని కలెక్టర్ అన్నారు. ప్రత్యేక తరగతులకు హాజరయ్యే విద్యార్థులు ఆకలితో వస్తారని వారికి తన నిధులతో పాటు దాతల సహకారంతో అల్పాహారం ఏర్పాటు చేయిస్తానని కలెక్టర్ ప్రకటించారు. జిల్లా విద్యాశాఖాధికార రవిందర్ మాట్లాడుతూ విద్యార్థులు ఇతర విషయాలపై దృష్టి పెట్టకుండా కేవలం సాధించాల్సిన లక్ష్యంపైనే దృష్టిపెట్టాలన్నారు. పదవ తరగతిలో విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నామని ప్రతిరోజు విద్యార్థులకు చదువుకునేలా ప్రోత్సహిస్తున్నామని అన్నారు. లాల్‌కోట గజిటెడ్‌ప్రధానోపాధ్యాయులు మురళికృష్ణ మాట్లాడుతూ ప్రధానోపాధ్యాయులు మురళికృష్ణ మాట్లాడుతూ ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయలు సమన్వయంతో కృషిచేసి పదవ తరగతి ఫలితాల్లో జిల్లాను రాష్ట్రస్థాయిలో గుర్తింపు తెస్తామని అన్నారు. ప్రముఖ వ్యక్తిత్వ వికాస నిపుణుడు డా. లక్ష్మణ్ చేసిన ప్రసంగం విద్యార్థులకు ప్రేరణ కలిగిం చింది. విద్యార్థులు లక్ష్యంవైపే దృష్టి పెట్టాలని సూచించారు. కార్యక్ర మంలో ఎంపిడిఓ శ్రీనివాస్‌రెడ్డి, ఎంఈఓ లక్ష్మణ్‌సింగ్, ఎస్ఎంసి ఛైర్మన్ కృష్ణయ్య, ఎంపిటిసి శిరాజు, మాజీ జడ్పీటిసి వేణుగోపాల్, వివిధ పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ రవినాయక్



హాజరైన విద్యార్థులు

## పార్లమెంట్ ఎన్నికలకు ఓటరు జాబితాను సిద్ధం చేయాలి

**నాగర్‌కర్నూల్ ప్రతినిధి, డిసెంబర్16 ప్రభాతవార్త:** రాబోయే పార్లమెంట్ ఎన్నికలకు ఓటరు జాబితాను తప్పులు లేకుండా రూపొందించే విధంగా చర్యలు తీసుకోవాలని డీఆర్డీఓ నర్సింగ్‌రావు సూచించారు. శనివారం ఎస్ఐసీ వీడియో కాన్ఫరెన్స్ సమావేశ మందిర్ హాల్‌లో స్పెషల్ సమ్మరి రివిజన్ 2024పై తహసీల్దార్లు, డీటీలు, బి.ఎల్ఓ, సూపర్‌వైజర్లతో ఓటరు జాబితా తయారుపై జిల్లా స్థాయి శిక్షణ తరగతులతో అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జనవరి 1 2024 నాటికి 18 సంవత్సరాల వయస్సు పూర్తి చేసిన యువతీ, యువకులు ఓటరు జాబితాలో పేర్లు నమోదు చేయించాలని, వచ్చిన ధరఖాస్తులను మాత్రం చాలా జాగ్రత్తగా పరిశీలించి అర్హులందరికి ఓటరు జాబితాలో నమోదయ్యే విధంగా చూడాలన్నారు. నమోదు కావచ్చు, తొలగింపు లేదా పోలింగ్ స్టేషన్ మార్పు చేర్పులు, ప్రతిధి నిబంధనలు, ఒక పద్ధతి ప్రకారం జరగాలని సూచించారు. ఓటరు జాబితా తప్పులు లేకుండా సిద్ధం చేసేందుకు తహసీల్దార్లు, బీఎల్ఓలు, సూపర్‌వైజర్లు గ్రామాల్లో తిరిగి బీఎల్ఓలతో కూర్చొని ప్రక్షాళన చేసుకోవాలని సూచించారు. అవసరమైన చోట కొత్త పోలింగ్ స్టేషన్లు ఏర్పాటు చేసుకునేందుకు ఇప్పుడు మంచి అవకాశం ఉందని, అందుకు అవసరమైన ప్రతిపాదనలు తయారు చేసి పంపాలని ఆదేశించారు. నిబంధనలను పాటించకుండా ఓటరు జాబితా నుంచి చనిపోయిన వారి పేర్లు తొలగించవద్దని, తప్పకుండా నిబంధనలు పాటించాలని సూచించారు. ఎస్.ఎస్.ఆర్ 2024 ప్రకారం డిసెంబర్ 20 నుంచి జనవరి 5వరకు పోలింగ్ స్టేషన్ల పునర్ వ్యవస్థీకరణ, ప్రస్తుతం ఉన్న ఓటరు జాబితాలోని తప్పులను గుర్తించి సవరించే ప్రక్రియ చేపట్టాలన్నారు. జనవరి 6న ముసాయిదా జాబితా ప్రచురించాలని, 6వ తేదీ నుంచి జనవరి 22వరకు అభ్యంతరాల స్వీకరణ ఉంటుందన్నారు. ఫిబ్రవరి 2 వరకు అన్ని ఫిర్యాదులు పరిష్కరించి 6వ తేదీన తుది జాబితా ప్రచురణ కొరకు కమిషన్‌కు పంపించాలన్నారు. ఫిబ్రవరి 8వ 2024ను ఓటరు తుది జాబితా ప్రకటించాల్సి ఉంటుందన్నారు. 18 సంవత్సరాలు వయస్సు నిండిన ప్రతి యువత ఓటరు జాబితాలో పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు. ఈ డిస్టిక్ మేనేజర్ నరేష్ ఓటర్ల నమోదు డిలీషన్ మార్పులు, చేర్పుల అంశాలపై శిక్షణ అందించారు. ఎన్నికల సెక్షన్ డీటీ రఘు, ఎన్ఐసీ కోఆర్డినేటర్ హర్షద్, తహసీల్దార్లు, డీటీలు, బీఎల్ఓలు, సూపర్‌వైజర్లు తదితరులు ఉన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న డీఆర్డీఓ నర్సింగ్‌రావు

## భూముల సమస్యలపై దృష్టి పెట్టి పెండింగ్ ఉన్న వాటిని పూర్తి చేయాలి

- గద్వాల జిల్లా కలెక్టర్ వల్లూరు క్రాంతి

**గద్వాల, డిసెంబర్ 16, ప్రభాతవార్త:** ధరణి, రెవెన్యూ, ఇనాం భూములకు సంబంధించిన సమస్యల పై దృష్టి పెట్టి పెండింగ్ ఉన్న వాటిని పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ వల్లూరు క్రాంతి తహసిల్దార్లకు ఆదేశించారు. శనివారము ఐడిఓసి కాన్ఫరెన్సు హాలు నందు అన్ని మండలాల తహసిల్దార్లతో ఏర్పాటు చేసిన సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ ధరణి, రెవెన్యూ ఇనాము భూములకు సంబంధించి పెండింగ్ ఉన్న సమస్యలపై అదనపు సిబంధిని ఏర్పాటు చేసి ప్రణాళిక ప్రకారం ఒక్కొక్క దరకాస్తు పై ఫీల్డ్ వెరిఫికేషన్ చేసి పూర్తి చేయాలని అన్నారు. డెత్ కేసులకు సంబంధించి (లీగల్‌ఏర్ ) కుటుంబ సభ్యుల దృవీకరణ పత్రం తప్పక ఉండాలన్నారు. భారత్ మాల క్రింద నష్టపోయిన రైతుల పరిహారం గురించి మాట్లాడారు. భారత్ మాల రహదారి నిర్మాణ కార్యక్రమంలో భాగంగా భూములకు సంబంధించిన పెండింగ్ ఉన్న వాటిని వారం లోపు పూర్తి చేయుటకు అధికారులు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అన్ని మండలాల వారిగాసంబంధిత తహసిల్దర్లతో వివరాలు అడిగి తెలుసుకున్నారు. సర్వే నెంబర్ల ప్రకారం వెరి పై చేసి త్వరలో పూర్తి చేయాలని తహసిల్దార్లకు ఆదేశించారు. ఫార్మ్ 6,7,8 లకు సంబంధించి బి ఎల్ ఓ లతో సమావేశము ఏర్పాటు చేసి ఏ ఇ ఆర్ఓలాగిన్ లో పెండిండ్ ఉన్న వాటిని పూర్తి చేయాలన్నారు. డ్రాఫ్ట్ రోల్‌కు ముందే ఫార్మ్లు అన్నియు పూర్తి చేయాలని తహసిల్దార్లకు ఆదేశించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ రెవెన్యూ చీర్ల శ్రీనివాస్, అన్నిమండలాల తాసిల్దారులు, సెక్షన్ సుపరింతెన్డేంట్ నరేష్ తదితరులు పాల్గొన్నారు.



## నేటి నుండి మన్యంకొండలో ధనుర్మాసం పూజలు ప్రారంభం

**దేవరకద్ర, డిసెంబరు16 ప్రభాతవార్త:** మన్యంకొండ శ్రీ లక్ష్మి వెంకటేశ్వరస్వామి దేవస్థానంలో ఆదివారం రాత్రి నుండి ధనుర్మాసం పూజలు ప్రారంభం కానున్నాయి. మన్యంకొండ దేవస్థానంలో నెల రోజులపాటు ఈ పూజా కార్యక్రమాలను ఘనంగా నిర్వహిస్తారు. ప్రతి ఏడాది మన్యంకొండ దేవస్థానంలో ధనుర్మాసం పూజలను అత్యంత ఘనంగా నిర్వహిస్తారు. అందులో భాగంగా ఈ ఏడాది కూడా మన్యంకొండలో ధనర్మాసం పూజలు అన్ని ఏర్పాట్లు చేశారు. ఈ సందర్భంగా నెలరోజులపాటు దేవస్థానంలో ప్రతిరోజు వివిధ పూజా కార్యక్రమాలను నిర్వహిస్తారు. కావున భక్తులు ఈ పూజా కార్యక్రమంలో అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారి కృపకు పాత్రులు కావాలని దేవస్థానం వంశపారంపర్య ధర్మకర్త, ఛైర్మన్ అళహరి మధుసూదన్‌కుమార్, ఈఓ శ్రీనివాసరాజు కోరారు.

## వికసిత్ భారత్ సంకల్ప యాత్రను విజయవంతం చేయాలి

**◆వనపర్తి జిల్లా పరిషత్ ఛైర్మన్ లోకనాథ్‌రెడ్డి**



వికసిత్ భారత్ సంకల్ప యాత్ర ప్రారంభిస్తున్న జడ్పీ ఛైర్మన్ లోకనాథ్‌రెడ్డి

**వనపర్తి ప్రతినిధి, డిసెంబర్16, ప్రభాతవార్త:** వికసిత్ భారత్ సంకల్ప యాత్రను జిల్లాలో విజయవంతం చేయాలని జిల్లా పరిషత్ ఛైర్మన్ లోకనాథ్ రెడ్డి అన్నారు. శనివారం వనపర్తి మండలంలోని పెద్ద గూడెం గ్రామంలో జరిగిన వికసిత్ భారత్ సంకల్ప యాత్ర ప్రారంభోత్సవ కార్యక్రమంలో కేంద్ర ప్రభుత్వ నేషనల్ వాటర్ ఇన్ఫర్మేటిక్ సెంటర్ సంచాలకులు రాజీవ్‌కుమార్ మిశ్రా, ప్రోగ్రాం నోడల్ అధికారి, డిఆర్‌డివో పిడి నర్సింహులు, గ్రామ సర్పంచు కొండన్నతో కలిసి ఐఈసి వాహనాన్ని జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా పరిషత్ ఛైర్మన్ లోకనాథ్ రెడ్డి మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ద్వారా అమలు చేస్తున్న అభివృద్ధి , సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతి లబ్ధిదారులకు అందించడం , వాటిపై అవగాహనను కల్పించడం ఈ యాత్ర ముఖ్య ఉద్దేశ్యమన్నారు. 2047 నాటికి అభివృద్ధి చెందిన భారతదేశంగా ఉంచేందుకు తమ వంతు కృషి చేస్తామని అందరు ప్రతిజ్ఞ చేశారు. అంతకుముందు భారత ప్రధానమంత్రి నరేంద్ర మోడి ఢిల్లీ నుండి వర్చువల్ ద్వారా జెండా ఊపి యాత్రను ప్రారంభించారు. కేంద్ర ప్రభుత్వ పథకాలను వివరిస్తూ అర్హులైన ప్రతి ఒక్కరు ఈ పథకాలను సద్వినియోగం చేసుకుని 2047 నాటికి అభివృద్ధి చెందిన భారతదేశంగా మార్చేందుకు తమ వంతు కృషి చేయాలని పిలుపునిచ్చారు. జిల్లాకు కెటాయించిన రెండు యాత్ర వాహనాలు రోజుకు రెండు నుండి మూడు గ్రామాలు తిరుగుతూ జిల్లా వ్యాప్తంగా ప్రజలకు అవగాహన కల్పిస్తూ లబ్ధిదారుల నుండి వారి మాటల్లో ఫీడ్ బ్యాక్ తీసుకుంటూ 2024 జనవరి 26 నాటికి యాత్రముగుస్తుందన్నారు. రైతులకు డ్రోన్ ద్వారా మందుల పిచికారి చేసే డ్రోన్ ప్రదర్శనను ప్రదర్శించారు. ఈ కార్యక్ర మంలో డిఆర్‌డివో పిడి నర్సింహులు, లీడ్ బ్యాంక్ మేనేజర్ అమో ల్ పవార్, మిషన్ భగీరథ ఈఈ మేఘారెడ్డి, గ్రామ సర్పంచ్ కొండన్న, గ్రామస్థులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## మాజీ ఎమ్మెల్యే గురునాథ్‌రెడ్డికి సన్మానం



**నారాయణపేట ప్రతినిధి, డిసెంబరు 16 ప్రభాతవార్త :** కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు కొడంగల్ మాజీ ఎమ్మెల్యే గురునాథ్‌రెడ్డిని శనివారం పలువురు కాంగ్రెస్ నాయకులు కలిసి సన్మానించారు. ఇటీవల కొడంగల్ నియోజకవర్గంలో టిపిసిసి అధ్యక్షులు ప్రస్తుత ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి గెలుపులో కీలక పాత్ర వహించిన గురునాథ్‌రెడ్డికి కొడంగల్ నియోజకవర్గ అభివృద్ధికి తనవంతు పాత్ర పోషించాలని ఈ సందర్భంగా నాయకులు కోరారు. కార్యక్రమంలో ఆల్ ఇండియా బంజారా సేవ సంఘ్ నారాయణపేట జిల్లా అధ్యక్షులు, మద్దూరు మండల కాంగ్రెస్ నాయకులు అనిల్‌నాయక్, మండల కాంగ్రెస్ పార్టీ ఎస్టీసెల్ అధ్యక్షులు లక్ష్మణ్‌నాయక్, సోమ్లా నాయక్, ఉపసర్పంచ్ రాంసింగ్ నాయక్ పాల్గొన్నారు.

## సోషల్ మీడియాలో యువత మోజు

● పరిచయం లేని వ్యక్తులతో కొత్త స్నేహాలు
● కష్టాలను కొని తెచ్చుకుంటున్న వైనం



**వనపర్తి ప్రతినిధి, డిసెంబర్16. ప్రభాత వార్త:** ఎలాంటి కల్మశం లేని స్నేహం మనస్సుకు ప్రశాంతతను ఇస్తుంది. రోజు రోజుకు పెరుగుతున్న ఆధునిక యుగంలో సామాజిక మాధ్యమాల ద్వారా యువతీ యువకుల మధ్య ఏర్పడుతున్న కొత్త పరిచయాలు వారి జీవితాలనుఅంధకారంలోకి పడేస్తూ కుటుంబాల్లో తీరని విషాధాన్ని మిగిలిస్తున్నాయి. చేతిలో ఆండ్రా యిడ్ మొబైల్స్ ఉండడంవల్ల సమాజంలో జరుగుతున్న ప్రతి విషయం సోషల్ మీడియాల్లో క్షణాల్లోఎలా తెలుస్తాయో అంతే స్థాయిలో ఫేక్ అకౌంట్‌లతో మోస పోవడంతోపాటు వారిడబ్బులు జీవితాలను నాశనం చేసుకుంటున్నారు.

**ఆండ్రాయిడ్ మొబైల్స్ రాకముందు :** ఆండ్రాయిడ్ మొబైల్స్ రాకముందు ప్రతి విషయాన్ని పిల్లలు తమ తల్లిదండ్రులకు చెప్పుకునేవారు. యువత అడుగులు సైతం వస్తున్న మార్పు విషయంలో కూడా తల్లిదండ్రులకు అర్థమయ్యే పరిస్థితి ఉండేది. తెలియని విషయాలను సైతం తెలిసిన వారి దగ్గర తెలుసుకునే సందర్భాలు ఉండేవి దీంతో పెద్దల పట్ల మర్యాద పూర్వకంగా వ్యవహరించేవారు.

**మారుతున్న జీవన విధానాలు :** యుక్త వయస్సులో వస్తున్న మార్పులకు అనుగుణంగా తల్లిదండ్రులు తమ పిల్లలకు ఎప్పటికప్పుడు గమనిస్తుండాలి. యుక్త వయస్సులో ప్రేమకు, ఆకర్షణకు మధ్యఉన్న వ్యత్యాసాన్ని తల్లిదండ్రులు వివరించాలి. అన్ని విషయాలను తల్లిదండ్రులకు పిల్లలు చెప్పుకునే విధంగా అవకాశాన్ని కల్పించాలి. ఉరుకుల పరుగుల జీవితంలో ఎవరి పనుల్లో వారు బిజి కావడం వల్ల ఒకరినొకరు పట్టించుకోవడం వంటివి కుటుంబాల్లో వాతావరణం కనిపించడం లేదు. దీంతో తల్లిదండ్రులకు మధ్య దూరం పెరుగుతుంది. ఎలాంటి వారితో స్నేహం చేస్తున్నారు వారి మధ్య ఎలాంటి సంభాషణలు జరుగుతున్నాయి వంటి విషయాలకు తెలియకపోవడం వల్ల అనేక అనార్థాలకు దారి తీస్తున్నాయి. కొత్త కొత్త అనుభూతులు పొందాలని ప్రేరేపిస్తున్న సమయంలో చాలా వరకు చదువుపై శ్రద్ధ పెట్టకుండా లక్ష్యాన్ని విస్మరించి యువత రకరకాల వ్యసనాలకు బానిసలయ్యే ప్రమాదాలు సైతం మెండుగా ఉన్నాయి. తల్లిదండ్రులు ఎంతటి పనిలో ఉన్న పిల్లల ప్రవర్తనపై ఎప్పటికప్పుడు శ్రద్ధ పెట్టడం కుటుంబానికే శ్రేయస్కరం.

**తల్లిదండ్రులు పిల్లల కదలికలను ఎప్పటికప్పుడు గమనిస్తుండాలి :**

**మహేశ్వరరావు పట్టణ సీఐ, వనపర్తి**



మారుతున్న సామాజిక వ్యవస్థలో యువత ఎక్కువగా మొబైల్స్‌తోనే కాలాన్ని గడుపుతున్నారు. ముఖ్యంగా తమ పిల్లలు ఎలాంటి వెబ్‌సైట్లను చూస్తున్నారు వాటిని మంచి కోసం వినియోగిస్తున్నారా లేని అని తల్లిదండ్రులు నిత్యం గమనిస్తుండాలి. ఆన్‌లైన్ తరగతులుఅయిన వెంటనే పిల్లలుమొబైల్స్ వాడకాన్ని తల్లిదండ్రులు తగ్గించేలా వారితో సమయాన్ని ఎక్కువగా గడపాలి.

## చిన్నపొర్ల ఉన్నత పాఠశాలలో తల్లిదండ్రుల సమావేశం



సమావేశంలో పాల్గొన్న విద్యార్థుల తల్లిదండ్రులు

**ఉట్కూర్, డిసెంబరు 16 ప్రభాతవార్త:** విద్యార్థుల చేత లైబ్రరీ పుస్తకాలను చదివించారు. విద్యార్థుల చేత కథలు, పద్యాలు చెప్పించారు. వేగంగా చదివిన విద్యార్థులను అభినందించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు సత్యనారాయణ, ఉపాధ్యాయ బృందం జగన్నాథరావు, రాయల్‌హన్న, నరసింహ, కృష్ణమ్మ, భాస్కర్, శ్రీధర్, లక్ష్మణ్, రేవతి, అంబదాస్, సోయల్ విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## రూ.3201 ధర పలికిన ఆర్ఎస్ఆర్ ధాన్యం

**దేవరకద్ర, డిసెంబరు16 ప్రభాతవార్త:** దేవరకద్ర వ్యవసాయమార్కెట్ యార్డుకు శనివారం రైతులు 116 ఆర్ఎన్ఆర్ ధాన్యాన్ని రైతులు విక్రయానికి తీసుకవచ్చారు. వీటికి అత్యధికంగా కింటాల్‌కు రూ.3201 ధర పలికింది. అతి తక్కువగా రూ.2880 ధర పలికింది. అలాగే 8 కింటాళ్ళ ప్యాడిహంస ధాన్యాన్ని విక్రయానికి తీసుకవచ్చారు. వీటికి అత్యధికంగా కింటాలుకు రూ.2006 ధర పలికింది. అలాగే అతితక్కువగా రూ.2004 ధర పలికింది. 11 కింటాళ్ళ ఆముదాలను రైతులు విక్రయానికి తీసుకవచ్చారు. వీటికి అతి ఎక్కువగా కింటాల్‌కు రూ.5309 ధర పలికింది. అలాగే అతితక్కువగా రూ.5305 ధరపలికినట్లు మార్కెట్ అధికారులు తెలిపారు.

## కోయిల్‌సాగర్‌లో నిలుకడగా నీటిమట్టం

**దేవరకద్ర, డిసెంబరు 16 ప్రభాతవార్త:** జిల్లాలోని భారీ నీటిపారుదల కోయిల్‌సాగర్‌లో నీటిమట్టం నిలుకడగా ఉంది. తీలేర్ పంప్‌హౌజ్ ద్వారా కృష్ణ జలాలను కోయిల్‌సాగర్‌కు తరలించడం ఆపేశారు. దీంతో ప్రాజెక్టులో శనివారం సాయంత్రం నాటికి ప్రాజెక్టులో నీటిమట్టం 31.8ఫీట్లకు తగ్గింది. కోయిల్‌సాగర్ ప్రాజెక్టు పూర్తి నీటి నిల్వ స్థోమత 32.5 ఫీట్లు. ప్రాజెక్టులోకి కొత్త నీరు వచ్చి చేరుతుండటంలో కోయిల్‌సాగర్‌కు జలకళ వస్తుంది. ప్రాజెక్టును చూడటానికి వచ్చే పర్యాటకుల సంఖ్య కూడ క్రమేపి పెరుతుంది.

## ఘనంగా స్వయంపరిపాలన దినోత్సవం



ఉపాధ్యాయులైన విద్యార్థులు

**దేవరకద్ర, డిసెంబరు 16 ప్రభాతవార్త:** దేవరకద్ర మండలం డోకూర్ తపోవన్ ఉన్నత పాఠశాలలో శనివారం స్వయంపరిపాలన దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ప్రిన్స్‌పాల్‌గా సంధ్య, యంఈఓగా అజయ్, డీఈఓగా సంతోష్, కలెక్టర్‌గా పల్లవి, డిప్యూటి కలెక్టర్‌గా వినయ్, వైస్ ప్రిన్స్‌పాల్‌గా శంకర్, కరస్పాండెట్‌గా యశ్వంత్, అకౌంటెంట్‌గా నవ్యత, అటెండర్‌గా శివానందులతో పాటు దాదాపు 50 మంది విద్యార్థులు ఉపాధ్యాయులుగా వ్యవహరించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయుల వేషాధారణలో విద్యార్థులు వ్యవహరించిన తీరు చూపరులను ఆకట్టుకొంది. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్స్‌పాల్ నిరంజన్‌రెడ్డిలతో పాటు ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

## శ్రీశ్రీ చెన్నకేశవ స్వామి బ్రహోత్సవాలకు ఏర్పాట్లు

**వనపర్తి ప్రతినిధి, డిసెంబర్ 16. ప్రభాతవార్త:** పెద్దమందడి మండల కేంద్రంలోని శ్రీశ్రీ చెన్నకేశవ స్వామి దేవాలయంలో నిర్వహించనున్న బ్రహోత్సవాలకు సంబంధించిన ఏర్పాట్లపై ఏవో, గ్రామస్థులతో కలిసి శనివారం సమావేశాన్ని నిర్వహించినట్లు మాజి సింగల్ విండో అధ్యక్షులు సత్యారెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బ్రహోత్సవాలకు సంబంధించిన ఏర్పాట్లను త్వరలో పూర్తి చేయడం జరుగుతుందన్నారు. ఈ సమావేశంలో గ్రామ సర్పంచ్ వెంకటస్వామి, సింగిల్ విండో డైరెక్టర్ వాకిటి నరేష్ కుమార్, పల్లె సత్యనారాయణ, స్కూల్ చైర్మన్ రవి కుమార్, తదితరులు పాల్గొన్నారు.

# ట్రాఫిక్ సిగ్నల్స్ రూల్స్ పాటించాలి

● నారాయణపేట జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష
● ట్రాఫిక్ సిగ్నల్స్ ప్రారంభించిన జిల్లా కలెక్టర్ , ఎస్పీ

**నారాయణపేట ప్రతినిధి, డిసెంబరు 16 ప్రభాతవార్త:** జిల్లా కేంద్రంలోని సత్యనారాయణ చౌరస్తాలో అధునాతన ట్రాఫిక్ సిగ్నల్స్‌ను శనివారం మధ్యాహ్నం జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష, ఎస్పీ యోగేష్ గౌతమ్‌లు ప్రారంభించారు. అనంతరం అదనపు కలెక్టర్ మయాంక్ మిత్తల్ ట్రాఫిక్ సిగ్నల్స్ స్విచ్ ఆన్ చేసి సిగ్నల్స్ ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ నారాయణపేట జిల్లా కేంద్రంలో ట్రాఫిక్ సమస్యను దృష్టిలో ఉంచుకొని ప్రజల సౌకర్యార్థం నూతన ట్రాఫిక్ సిగ్నల్స్‌ను ఏర్పాటు చేయడం జరిగిందని, ప్రజలు, వాహనదారులు ట్రాఫిక్ సిగ్నల్స్ రూల్స్ పాటించాలని తెలి పారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ జిల్లా కేంద్రంలో ఎప్పుడు రద్దీగా ఉండే సత్యనారాయణ చౌరస్తాలో ప్రజలకు ఎలాంటి ట్రాఫిక్ ఇబ్బందులు లేకుండా మొదటగా ట్రాఫిక్ సిగ్నల్స్‌ను ప్రారంభించడం జరిగిందన్నారు. రోడ్డు ప్రమాదాలు నివారించేందుకు రోడ్డుపై వాహనాలు ఇష్టమొచ్చిన విధంగా వెళ్లకుండా క్రమశిక్షణతో, ట్రాఫిక్ సిగ్నల్స్‌ను అనుసరిస్తూ తమ గమ్యస్థానాలకు క్షేమంగా చేరుకోవాలని ఎస్పీ తెలిపారు. వాహనదారులు ట్రాఫిక్ రూల్స్ పాటిస్తూ పోలీసులకు సహకరించాలని లేని ఎడల ట్రాఫిక్ రూల్స్ పాటించని వారిపై కేసులు నమోదు చేయడం జరుగుతుందని ఎస్పీ తెలి పారు. కార్యక్రమంలో డిసిఆర్బి డీఎస్పీవెంకటేశ్వరరావు, సిఐలు రవిబాబు, రామల్‌లాల్, ఎస్సైలు విజయ్‌కుమార్, పర్వతాలు, విజయ్‌భాస్కర్, హరి ప్రసాద్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



ట్రాఫిక్ సిగ్నల్స్‌ను ప్రారంభిస్తున్న కలెక్టర్, ఎస్పీ

# మా ప్రాంతానికి ప్రత్యేక నిధులు కేటాయించండి

**-మంత్రి జూపల్లికి మండల అధ్యక్షులు పండిత్‌రావు శుభాకాంక్షలు**

**వంగూరు, డిసెంబర్16 ప్రభాతవార్త:** వంగూరు మండల అభివృద్ధి కోసం మంత్రి నిధుల నుంచి ప్రత్యేక నిధులను కేటాయించాలని వంగూరు మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు పండిత్‌రావు మంత్రి జూపల్లి కృష్ణారావును కలిసి కోరారు. శనివారం మంత్రి జూపల్లి కృష్ణారావు స్వగృహంలో పండిత్‌రావు మర్యాద పూర్వకంగా కలిసి శాలువాతో సన్మానించి పుష్పగుచ్ఛం అందించి మంత్రిగా ఎన్నికైనందుకు హార్థిక శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వంగూరు మండలాన్ని అభివృద్ధి పర్చేందుకు ప్రత్యేక దృష్టి సారించాలని ఆయన అన్నారు. అధికారం ఉన్న లేకపోయిన ప్రజలు కార్యకర్తలు కాంగ్రెస్ పార్టీని నమ్ముకొని ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొన్నారని, కాంగ్రెస్ పార్టీ కార్యకర్తల ఇబ్బందులను తీర్చడానికి ప్రజలు కోరుకున్నట్లుగా ఈ ప్రాంత అభివృద్ధికి జిల్లా మంత్రులు సహకరించి ప్రత్యేక దృష్టిని సారించాలని ఆయన అన్నారు.



మంత్రి జూపల్లి కృష్ణారావును కలిసి శుభాకాంక్షలు తెలుపుతున్న పండిత్‌రావు

# తల్లిదండ్రులు పిల్లలతో సమయాన్ని పంచుకోవాలి

● జిల్లా మానటరింగ్ అధికారి మహానంది

**వనపర్తి ప్రతినిధి, డిసెంబర్16, ప్రభాతవార్త:** తల్లిదండ్రులు తమ పిల్లలతో కొంత సమయాన్ని పంచుకోవాలని జిల్లా మానటరింగ్ అధికారి మహానంది అన్నారు. శనివారం పెద్దమందడి మండలంలోని మణిగిల్ల గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థుల తల్లిదండ్రులతో నిర్వహించిన సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ముందుగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు పాఠశాలలో అమలవుతున్న ఉన్నతి కార్యక్రమం, లక్ష్యం కార్యక్రమం, 10వ తరగతి విద్యార్థులకు అందిస్తున్న ప్రత్యేక తరగతుల గురించి తల్లిదండ్రులకు వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తల్లిదండ్రులు తమ పిల్లలతో కొంత సమయాన్ని కెటాయించడం వల్ల అన్ని రకాల విషయాలను చర్చించుకోవడానికి వీలుగా ఉంటుందన్నారు. ఉపాధ్యాయులు ఉన్నతి కార్యక్రమ వివరాలను ఎప్పటికప్పుడు యాప్‌లో నమోదు చేయాలన్నారు. పాఠశాల పూర్వపు విద్యార్థి కొండ బాల్‌రెడ్డి అందజేసిన కంప్యూటర్ ల్యాబ్‌ను వినియోగించుకోవాలని, సామర్థ్యాలు సాధించేలా కృషి చేస్తున్న ఉపాధ్యాయులకు తమ అభినందనలను తెలిపారు. ఈ కార్యక్రమంలో సెక్టోరియల్ అధికారి యుగంధర్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు, అధ్యాపకులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా మానటరింగ్ అధికారి మహానంది

# విద్యార్థులను దత్తత తిసుకుని చదువు చెప్పడం అభినందనీయం

**వీపనగండ్ల, డిసెంబర్ 16, ప్రభాతవార్త :** వీపనగండ్ల మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను, ఎంఆర్సి పాఠశాలను జిల్లా విద్య అధికారి నరహరి, మండల విద్యాధికారి లక్ష్మణ్ నాయక్ సందర్శించారు. అధికారులు బాలుర ఉన్నత పాఠశాలలో పదవ తరగతి చదువుతున్న విద్యార్థుల తరగతి గదిలోకి వెళ్లి విద్యాబోధన ఎలా జరుగుతుందని, పాఠ్యాంశాలు ఉపాధ్యాయులు ప్రణాళిక ప్రకారం పూర్తి చేస్తున్నారా లేదా అని అదేవిధంగా మీకు ప్రత్యేకమైన తరగతులు నిర్వహిస్తున్నారా లేదా అని విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. అదేవిధంగా పదవి తరగతి విద్యార్థులను ఏడు గ్రూపులుగా విభజించి ఉపాధ్యాయులు విద్యార్థులను దత్తత తీసుకొని బోధించడం చాలా శ్రేయస్కరమైనది అని ఉపాధ్యాయులను అభినందించారు. వారు మాట్లాడుతూ పదవి తరగతిలో విద్యార్థులు 100 శాతం ఉత్తీర్ణత సాధించాలని ఉపాధ్యాయులకు, విద్యార్థులకు సలహాలు సూచనలు చేశారు. తరువాత ప్రాథమిక పాఠశాల ఎం.ఆర్.సి. పాఠశాలను సందర్శించి విద్యార్థులకు తెలుగు పాఠ్యాంశం, ఇంగ్లీష్ పాఠ్యాంశాల సామర్థ్యాలను పరిశీలించారు. విద్యార్థులకు బోధన సామర్థ్యాల విషయంలో ఉపాధ్యాయులు సరియైన శిక్షణ ఇవ్వాలని విద్యార్థుల ఉత్తీర్ణశాతం పెరుగుతుందని వారు అన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ వంగూరు నరసింహారెడ్డి కాంప్లెక్స్ ప్రధాన ఉపాధ్యాయులు శ్రీనివాస్ రెడ్డి, ఎం.ఆర్.సి నాగేశ్వరమ్మ, ఉపాధ్యాయులు కృష్ణయ్య, బాలు మౌలానా, రాధా సిఆర్పి వెంకటేష్ పాల్గొన్నారు.



# యాసంగి సాగుపై రైతులకు అవగాహన కార్యక్రమం

**వనపర్తి ప్రతినిధి, డిసెంబర్16, ప్రభాతవార్త:** యాసంగి సాగుపై రైతులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించినట్లు సీనియర్ సైంటిస్టు రాజేందర్‌రెడ్డి, ఏవో అనిల్ కుమార్ తెలిపారు. శనివారం రేవల్లి మండలంలోని చెన్నారం గ్రామంలో గ్రామ సర్పంచు రమేష్ అధ్యక్షతన రైతులకు రైతు వేదికల వద్ద అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రైతులు మార్కెట్లో డిమాండ్ ఉన్న పంటలను తక్కువ ఖర్చుతో ఎక్కువ ఆదాయం వచ్చే పంటలను ఎంచుకోవాలన్నారు. యాసంగి సాగుకు ఆరుతడి పంటలు బోర్ల కింద, బావుల కింద సాగు చేయాలని, ఈ సీజన్‌కు కాలువల ద్వారా నీళ్లు వచ్చే అవకాశాలు తక్కువగా ఉంటాయన్నారు. మినుములు, నువ్వులు, ఆముదాలకు భవిష్యత్తులో ఎక్కువ డిమాండ్ ఉందన్నారు. వరి పంటలను నారు పోసే పద్ధతి నుండి కూతకొచ్చేంత వరకు తగు జాగ్రత్తలను తీసుకోవాలన్నారు. అనంతరం రైతు పంట పొలాల వద్దకు వెళ్లి మినుములు, మిర్చి , మామిడి తోటలను వారు పరిశీలించారు. ఈ కార్యక్రమంలో గొల్లపల్లి, చీర్కపల్లి రైతుబంధు సమితి అధ్యక్షులు అర్జున్ రావు, రాములు, ఎంపిటిసి శాంతయ్య, మాజి ఎంపిటిసి రాజురెడ్డి, మాజి సర్పంచ్ పాశం సింగోటి, గ్రామ రైతులు పాల్గొన్నారు.



రైతులకు అవగాహన కల్పిస్తున్న సీనియర్ సైంటిస్టు రాజేందర్ రెడ్డి, ఏవో అనిల్ కుమార్

## భూత్పూర్ పీఎస్‌లో తల్లితండ్రుల సమావేశం

**-హాజరైన జిల్లా అకాడెమిక్ మానిటరింగ్ ఆఫీసర్ దుంకుడు శ్రీనివాస్**

**భూత్పూర్, డిసెంబర్ 16, ప్రభాతవార్త :** భూత్పూర్ పట్టణ కేంద్రంలోని ప్రాథమిక పాఠశాలలో శనివారం తల్లితండ్రుల సమావేశం జరిగింది. ఈ సమావేశానికి జిల్లా అకాడెమిక్ మానిటరింగ్ ఆఫీసర్ దుంకుడు శ్రీనివాస్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. విద్యార్థులకు వర్క్‌బుక్కులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ ఆదేశాల మేరకు ప్రాథమిక విద్యాస్థాయిలో ఆంగ్లబోధన జరగాలని ఇందుకోసం ఉపాధ్యాయులు తగిన చొరవచూపి ఆంగ్లవిద్యాబోధనలో తగిన మెళకువలు పాటించాలని సూచించారు. ఈ సమవేశంలో విద్యార్థుల తల్లితండ్రులతో పాటు క్లస్టర్ సీఆర్‌పి ఠాగూర్, పాఠశాల హెచ్‌ఎం యాదయ్య, రవిచంచల ఇతర ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జిల్లా అకాడెమిక్ మానిటరింగ్ ఆఫీసర్ దుంకుడు శ్రీనివాస్

## విద్యార్థులకు ఉపాధ్యాయులు ఉత్తమ విద్యనందించాలి

**నారాయణపేట జిల్లా అదనపు కలెక్టర్ మయాంక్ మిత్తల్**



విద్యార్థులతో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్

**నారాయణపేట ప్రతినిధి, డిసెంబరు16 ప్రభాతవార్త:** నారాయణపేట మండలం అంతవార్, ధన్వాడ మండలం మందిపల్లి గ్రామంలో మండల పరిషత్ పాఠశాలలో తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు హాజరై రిజిస్టర్లను తనిఖీ చేశారు. విద్యార్థులకు బోధన పట్ల అడిగి తెలుసుకున్నారు. వంటగది పరిశుభ్రంగా ఉండాలని తెలిపారు. పాఠశాల ఆవరణ మరుగుదొడ్లు పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. ఉపాధ్యాయులు విధుల పట్లఅలసత్వం ప్రదర్శించరాదని అన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులను సబ్జెక్టుల వారిగా ప్రశ్నలడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో పాఠశాలలహెచ్‌ఎంలు, పాల్గొన్నారు.

## ఘనంగా గీతా పారాయణం



ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న దృశ్యం

**వెల్దండ, డిసెంబర్ 16 ప్రభాతవార్త:** మండల కేంద్రంలోని బ్రహ్మగిరి దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి గీతాపారాయణం, సహస్రనామావళిని పఠించారు. పూజా కార్యక్రమాలకు వెల్దండ గ్రామ సర్పంచ్ యెన్నం భూపతి రెడ్డి, ఆర్యవైశ్య మహాసభ జిల్లా అధ్యక్షులు బచ్చు రామకృష్ణలు హాజరై మాట్లాడుతూ దైవ నామస్మరణతో ముక్తి లభిస్తోందని, ప్రతి ఒక్కరు దైవ చింతన కలిగి ఉండాలన్నారు. నిత్య పూజల వల్ల గ్రామంతో పాటు మన ప్రాంతం సస్యశ్యామలంగా ఉంటుందన్నారు. అనంతరం భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలోవెంకటేశ్వర్లు, మిర్యాల రాజయ్య పద్మ, ఉప్పు ఆంజనేయులు, అంజయ్యచారి, బాలయ్య, వేణుగోపా లాచారి, దినేష్, రామాచారి, సంతోష్, శివ, కిట్టు తదితరులు ఉన్నారు.

## జిల్లా అభివృద్ధికి తన వంతు కృషి చేస్తా

● అదనపు కలెక్టర్ లోకల్ బాడీస్ సంచిత్ గాంగ్వర్



**వనపర్తి ప్రతినిధి, డిసెంబర్16, ప్రభాతవార్త:** జిల్లాలోని అన్ని మున్సి పాలిటిలను బలోపితం చేసి జిల్లా అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని అదనపు కలెక్టర్ లోకల్ బాడీస్ సంచిత్ గాంగ్వార్ అన్నారు. జిల్లా అదనపు కలెక్టర్ లోకల్ బాడీస్ నియమితులైన సంచిత్ గంగ్వార్ ఐఎస్ 2021 బ్యాచ్ శనివారం జిల్లా కేంద్రంలోని ఐడిఓసి కార్యాలయంలోని తన ఛాంబర్ లో భాధ్యతలను స్వీకరించారు. అదనపు కలెక్టర్ రెవిన్యూ తిరుపతి రావు లోకల్ బాడీస్ భాధ్యతలను సిటిసిపై సంతకం చేసి నూతన అదనపు కలెక్టర్ కు భాధ్యతలు అప్పగించారు. అంతకు ముందు జిల్లాకు అదనపు కలెక్టర్‌గా నియమితులైన సంచిత్ గాంగ్వర్‌కు కలెక్టరేట్ ఏఓ భాను ప్రకాష్, డిఆర్‌డివో నర్సింహులు, వనపర్తి మున్సిపాలిటి కమిషనర్ విక్రమ సింహారెడ్డి, జిల్లా సంక్షేమ శాఖ అధికారి రామమహేశ్వర్‌రెడ్డి, ఇతర జిల్లా అధికారులు పూలమొక్కను అందించి స్వాగతం పలికారు.

## నేడు వాటర్ ప్యూరీపై అనాజిక్ ఇండిపెండెంట్ డిస్ట్రిబ్యూటర్ కార్యాలయం ప్రారంభోత్సవం

**భూత్పూర్, డిసెంబర్ 16, ప్రభాతవార్త:** స్వచ్ఛమైన తాగునీటి సరఫరా ధ్యేయంగా భూత్పూర్‌లో ఆదివారం సాయంత్రం చాంద్ మెడికల్ కాంప్లెక్స్‌లో అనాజిక్ స్వచ్చంద డిస్ట్రిబ్యూటర్ కార్యాలయాన్ని ప్రారంభిస్తున్నట్లు నిర్వహకులు మస్తాని గుమాని తెలిపారు. కార్యాలయాన్ని స్థానిక మున్సిపల్ చైర్మన్ సత్తూర్ బస్వరాజ్ గౌడ్ ప్రారంభిస్తారని, ముఖ్య అతిథిగా బిజినెస్ ఆచార్య బీఆర్ షఫీ హాజరౌతారని గుమాని తెలిపారు.

## ఇన్సూరెన్స్ కార్పొరేషన్ యూనియన్ 22 మహాసభ




**వనపర్తి టౌన్, డిసెంబర్16, ప్రభాతవార్త:** ఇన్సురెన్స్ కార్పోరేషన్ ఎంప్లాయిస్ యూనియన్ 22వ జనరల్ కాన్సరెన్స్ నందు ప్రసంగించిన మాజీ మంత్రివర్యులు నిరంజన్‌రెడ్డి.. ఈ సందర్భంగా నిరంజన్ రెడ్డి మాట్లాడుతూ ఎల్.ఐసి పబ్లిక్ సెక్టార్ అంటే నాకు చాలా ఇష్టం. నేను నా గృహ నిర్మాణం ఎల్.ఐసి సహకారం తీసుకున్నాను. పబ్లిక్ సెక్టార్ సంస్థలను కాపాడుకోవడం అంటేఈ దేశఉనికి కాపాడుకోవడం మేననిఅన్నారు. ఈ ప్రపంచములో ఎల్.ఐసి నాల్గవపబ్లిక్ సెక్టార్ సంస్థగా ఎదిగిందిఅన్నారు. సామూహిక ప్రయోజనాలు తగ్గి వ్యక్తిగతంగా ప్రయోజనాలు పెరిగినాయి. సామూహిక ప్రయోజనాలు గూర్చి చైతన్యం తీసుకురావలసిన బాధ్యత క్రియాశీలక పాత్ర పోషిస్తున్నపబ్లిక్ సెక్టార్‌బాధ్యత తీసుకోవాలని అన్నారు. ఎల్ఐసి యూనియన్ బిల్డింగ్ కోసం స్థలం కేటాయించడం కోసం కృషి చేస్తానని హామీ ఇస్తు న్నాను. ఈ సమావేశం మా వనపర్తి లో నిర్వహించినందుకు ధన్యవాదాలు తెలిపారు.

## కిడ్నీ వ్యాధిగ్రస్థునికి పరామర్శ



నీలారెడ్డిని పరామర్శిస్తున్న మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి

**వనపర్తి ప్రతినిధి, డిసెంబర్ 16. ప్రభాతవార్త :** గోపాల్‌పేట మండలం మున్ననూర్ గ్రామానికి చెందిన బిఆర్ఎస్ నాయకులు నీలారెడ్డి కిడ్నీ వ్యాదితో భాదపడుతు మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని ఎస్‌విఎస్ ఆసుపత్రిలో చికిత్సను పొందుతున్నాడు. విషయం తెలుసుకున్న మాజి వ్యవసాయశాఖ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి ఆసుపత్రికి చేరుకుని నీలారెడ్డిని పరామర్శించి ఆరోగ్య పరిస్థితి వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మాజి మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి మాట్లాడుతూ త్వరగా కోలుకుని ప్రజా సేవకు అంకితం కావాలని ఆకాంక్షించారు. మాజి మంత్రి వెంట మండల రైతు సమన్వయ సమితి అధ్యక్షులు తిరుపతయ్య, సర్పంచు శేఖర్ యాదవ్, గ్రామ పార్టి అధ్యక్షులు సాయిరాం పాల్గొన్నారు.

## సమన్వయంతో పనిచేసి మన పిల్లల భవితకు బాటవేద్దాం

**ఉట్కూర్, డిసెంబరు 16 ప్రభాతవార్త:** రాష్ట్ర విద్యాశాఖ ఆదేశానుసారం ఎంపియుపిఎస్ నిడుగుర్తి పాఠశాలలో పేరెంట్ టీచర్స్ సమావేశం (పిటిఎం) నిర్వహించారు. సమావేశంలో విద్యార్థుల తల్లిదండ్రులు ఎక్కువ సంఖ్యలో పాల్గొని ఉపాధ్యాయులతో చర్చించడం జరిగింది. ఈ సందర్భంగా విద్యార్థుల నైపుణ్యాలు తల్లిదండ్రుల ముందు ప్రదర్శించడం జరిగింది. దీనిపై తల్లిదండ్రులు సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు లక్ష్మారెడ్డి మాట్లాడుతూ విద్యార్థుల ప్రగతికి సమిష్టిగా కృషి చేసి ప్రణాళికలు వేసుకుందామని, ప్రస్తుతం కొనసాగుతున్న ఎఫ్‌ఎల్‌ఎన్, ఉన్నతి కార్యక్రమ అమలుతీరు గురించి అలాగే వర్క్‌షీట్‌ల ప్రాముఖ్యత, మూల్యాంకనం విధానం గురించి సవివరంగా తెలియజేశారు. విద్యార్థుల హాజరు ఎఫ్ఆర్ఎస్ ద్వారా నమోదు చేయడం జరుగుతుందని కావున తల్లిదండ్రులు తమ పిల్లలను తప్పకుండా సమయానికి పంపాలని కోరారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు లక్ష్మారెడ్డి, ఉపాధ్యాయులు పద్మ, సునిత, వెంకటప్ప, సుజాత, సలాం, లియాఖత్, శ్రీనివాస్, ఆంజనేయులు పాల్గొన్నారు.



తల్లిదండ్రుల సమావేశం నిర్వహిస్తున్న దృశ్యం

# చనిపోయిన వారి పేర్లను ఓటరు జాబితాలో తొలగించాలి

**● నారాయణపేట జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష**

**నారాయణపేట ప్రతినిధి,డిసెంబరు 16 ప్రభాతవార్త :** ఓటరు జాబితాలో నుంచి చనిపోయిన వారి పేర్లను తొలగించాలని నారాయణపేట జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష అన్నారు. కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో శని వారం ఏర్పాటు చేసిన తహసిల్దార్ సూపర్‌వైజర్, బిఎల్‌ఓల సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ వచ్చే పార్లమెంట్ ఎన్నికల కోసం తయారు చేసి ఓటరు జాబితాలో తప్పులు ఏమి ఉండరాదన్నారు. ముఖ్యంగా చనిపో యిన వారి పేర్లు, ఒకే ప్రాంతంలో ఒక్కరికే రెండు ఓట్లు ఉండకుండా తగి న జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. అయితే చనిపోయిన వారి పేర్లను ఆయా గ్రామాల పంచాయతీ సెక్రెటరీలను విచారించిన తర్వాతే తొలగించాలన్నారు. ఈ పేర్ల తొలగింపు విషయంలో సూపర్‌వైజర్లు, బిఎల ్‌ఓలు ఒకటికి రెండుసార్లు క్షుణ్ణంగా పరిశీలించాలని చెప్పారు. ఓటరు నమోదు, జాబితాకు సంబంధించిన పెండింగ్ పత్రాలను పూర్తి చేయాల న్నారు. ఓటరు ఇన్ఫర్మేషన్ స్లిప్‌లు ఇవ్వకపోవడం వల్ల చాలా వ్యత్యాసం వస్తుందన్నారు. మండలంలోని కొండాపూర్‌లో కొందరు గత ఐదు సంవ త్సరాలుగా నివాసం లేని వాళ్ల పేర్లు కూడా జాబితాలో అలాగే ఉన్నా యని,వాటిని తొలగించాలన్నారు. కాగా జిల్లాలో వందేళ్లకు పైబడి వయసు కలిగిన ఓటర్లు 900 మంది ఉన్నారని, ఇందులో నిజం ఎంత అనేది సూపర్‌వైజర్లు, బిఎల్‌ఓలు క్షేత్రస్థాయికి వెళ్లి విచారించాలన్నారు. వాస్త వానికి ఆ వయస్సు కలిగిన వారు ఉంటే ఖచ్చితమైన నిర్ధారణ అవసరం



మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్

అన్నారు. వచ్చే జనవరి 1 నుంచి 18 ఏళ్లు నిండిన ప్రతి యువతీ యువ కుడు ఓటరుగా నమోదు చేసుకోవాలన్నారు. జనవరి 1 తర్వాత ఏప్రిల్ 1 తర్వాతకూడా 18 ఏళ్లు నిండితే ఓటరుగా నమోదు చేసుకోవాలని ఆయన సూచించారు. అలాగే ఒకే ఇంట్లో వందకు పైగా ఓటర్లు ఉంటే క్షేత్రస్థాయికి వెళ్లి విచారణ చేసి ధృవీకరించాలని చెప్పారు. 1500 ఓటర్ల కంటే ఎక్కువ ఉంటే కొత్త పోలింగ్ స్టేషన్‌లను ఏర్పాటు చేస్తామని గతంలో ఉన్న పోలింగ్ కేంద్రానికి సమీపంలోనే కొత్త పోలింగ్ కేంద్రాన్ని ఏర్పాటు చేస్తామన్నారు. ఇటీవలే జరిగిన అసెంబ్లీ ఎన్నికల పోలింగ్ దామరగిద్ద మండలంలోని మొగల్‌మడక, మాగనూరు మండలంలోని వడ్వాట్ కేంద్రాలలో పోలింగ్ ఆలస్యంగా ముగిసిందని, ఇకపై అలాంటి సంఘటనలు జరగకుండా, అక్కడే రెండో పోలింగ్ కేంద్రాన్ని ఏర్పాటు చేయాలన్నారు. జిల్లాలో రెండు పోలింగ్ స్టేషన్లు తమకు దూరం అవుతున్నాయనే ఫిర్యాదులు వచ్చాయని వాటిలో భీమండి కాలనీ, రెండోది మక్తల్ మండలం చందాపూర్ ఉన్నాయ న్నారు. ఇలా ప్రతి అంశాలను, సూచనలను గుర్తు పెట్టుకొని ఓటరు జాబితాను సవరించాలని, ఇకపై అన్ని అర్హతలున్నా మాకు ఓటుహక్కు రాలేదనే మాట జిల్లాలో వినిపించకూడదని, ఫిబ్రవరి 8న ప్రచురించే తుది ఓటరు కొత్త జాబితాలో ఎలాంటి సమస్యా ఉండరాదని కలెక్టర్ తెలిపారు. సమావేశంలో అదనపు జిల్లా కలెక్టర్లు మయాంక్ మిత్తల్, అశోక్‌కుమార్, ఆర్డీఓ రాంచందర్, జిల్లాకు చెందిన అన్ని మండల తహసిల్దార్లు, సూపర్ వైజర్లు, బిఎల్‌ఓలు పాల్గొన్నారు.



సమావేశానికి హాజరైన అధికారులు

# వికసిత్ భారత్ సంకల్ప యాత్ర కార్యక్రమాన్ని విజయవంతం చేయాలి



వికసిత్ భారత్ సంకల్ప యాత్రను ప్రారంభిస్తున్న బండారు శృతి

**నాగర్‌కర్నూల్ ప్రతినిధి, డిసెంబర్ 16 ప్రభాతవార్త:** డిసెంబర్ 16 నుంచి జనవరి 26వరకు నాగర్‌కర్నూల్ జిల్లాలో నిర్వహించే వికసిత్ భారత్ సంకల్ప యాత్ర కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని లీడ్ బ్యాంక్ మేనేజర్ కౌశల్ కిశోర్ పాండే కోరారు. శనివారం సాయంత్రం నాగర్‌కర్నూల్ కలెక్టరేట్ ప్రాంగణంలో బీజేపీ రాష్ట్ర జర్నల్ సెక్రటరీ, కేంద్ర ప్రభుత్వ ప్రతినిధి బండారుశృతితో కలిసి వికసిత్ భారత్ సంకల్ప యాత్ర ప్రచార వాహనాలను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలను అర్హులైన లబ్ధిదారులను గుర్తించి అందించేందుకు గాను భారత ప్రధాని మోడీ ఈ నెల 16న సాయంత్రం 4 గంటలకు ఢిల్లీ నుంచి వర్చువల్ ద్వారా వికసిత్ భారత్ సంకల్ప యాత్రను ప్రారంభోత్సవం చేయగా, ఇందులో భాగంగా నాగర్‌కర్నూల్ జిల్లాలో కూడా ప్రారంభం చేసినట్లు ఆయన తెలిపారు. వికసిత్ భారత్ సంకల్ప యాత్ర కార్యక్రమ నిర్వహణకు కేంద్ర ప్రభుత్వం తరుపున బండారు శృతి నాగర్‌కర్నూల్ జిల్లాకు నియమించినట్లు తెలిపారు. ఈ యాత్ర కొరకు జిల్లాకు 6 ఐ.ఈ.సి (ఇన్ఫర్మేషన్ ఎడ్యుకేషన్ మరియు కమ్యూనికేషన్) వాహనాలు ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఒక్కో వాహనం ద్వారా రోజుకు రెండు నుంచి మూడు గ్రామాలు లేదా మున్సిపాలిటీల వార్డుల వారీగా పర్యటించి కేంద్ర ప్రభుత్వం 17 రకాల పథకాలను ప్రచారం చేయడం జరుగుతుంది. ఈ సందర్భంగా బండారు శృతి మాట్లాడుతూ దేశానికి స్వాతంత్ర్యం వచ్చి 75 సంవత్సరాలు పూర్తై 2047 నాటికి 100 సంవత్సరాలు పూర్తైవుతున్నందున అప్పటి వరకు అభివృద్ధి చెందిన దేశంగా ప్రకటించుకునే విధంగా ప్రతి ఒక్కరు అన్ని అభివృద్ధి చెందాలనే లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వం అనేక అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రవేశ పెట్టారన్నారు. వాటిని ప్రజల్లో విస్తృతంగా తీసుకెళ్లడానికి వికసిత్ భారత్ సంకల్ప యాత్ర చేపట్టినట్లు తెలిపారు. కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు, ప్రజా ప్రతినిధులు తదితరులు ఉన్నారు.

## ఘనంగా అయ్యప్పస్వామి మహా పడిపూజ



అయ్యప్పస్వాముల మహాపడిపూజ నిర్వహిస్తున్న అయ్యప్ప స్వాములు

**మూసాపేట,డిసెంబరు 16 ప్రభాతవార్త :** మూసపేట మండల కేంద్రంలోని కొంగరి శ్రీనివాసులు గురుస్వామి ఇంటి ఆవరణలో శనివారం సంకల్పసిద్ధి అయ్యప్ప సేవాసమితి ఆధ్వర్యంలో ఘనంగా అయ్యప్పస్వామి పడిపూజ కార్యక్రమాన్ని నిర్వహించారు. గోపి గురుస్వామి సమక్షంలో అత్యంత భక్తి శ్రద్ధలతో పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ముందుగా హరిద్ర గణపతి పూజతో ప్రారంభించి గణపతి, కుమార, అయ్యప్ప స్వాముల పూజలు నిర్వహించారు. అనంతరం అయ్యప్పస్వామి విగ్రహానికి పంచామృత అభిషే కాలు నిర్వహించారు. కార్తీక్‌చారి భజనతో భక్తి గీతాలు ఆలపించారు. ప్రత్యేక పూజలు 18 మెట్లపై కర్పూరం వెలిగించి భక్తిని చాటుకున్నారు. అనంతరం తీర్థ ప్రసాదాలు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సంకల్పసిద్ధి అయ్యప్ప సేవా సమితి అధ్యక్షుడు ఎన్. తిరుపతయ్యగౌడ్, గురుస్వాములు కాశినాథ్, దేవరాజ్, చెన్నయ్య, ప్రభాకర్, రమేష్, విశ్వేశ్, శ్రీను,తిరుపతి, వివిధ గ్రామాలఅయ్యప్ప భక్తులు మహిళా భక్తులు సేవాసమితి సభ్యులు పాల్గొన్నారు.

## ఘనంగా ప్రజా డాక్టర్ బాలకిష్టయ్య వర్ధంతి



**వనపర్తి టౌన్,డిసెంబర్ 16,ప్రభాతవార్త:** మాజీ శాసనసభ్యులు,స్వాతంత్ర సమర యోధులు,ప్రజా డాక్టర్ బాలకిష్టయ్య వర్ధంతి సందర్భంగా శనివారం సాయంత్రం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వం ఆసుపత్రి నందు ఏర్పాటు చేసిన ఆయన విగ్రహానికి బి.ఆర్ ఎస్ పార్టీ ప్రజా ప్రతినిధులు నాయకులు, కార్య కర్తలు,అభిమానులు పూలమాలలు వేసి నివాళ్లు అర్పించారు.ఈ కార్యక్ర మంలో బి.ఆర్.ఎస్, పార్టీ జిల్లా అధ్యక్షులు,మున్సిపల్ చైర్మన్ గట్టు యాదవ్,పార్టీ ప్రధాన కార్యదర్శి గంధం పరంజ్యోతి,కౌన్సిలర్లు ఉంగ్లం తిరు మల్,స్టార్ రహీం,డి.శేఖర్ యూత్ ప్రసిడెంట్ సూర్యావంశం గిరి యాదవ్ పార్టీ నాయకులు నందిమల్ల రమేష్,చిట్యాల రాము,ఆగుపోగు కుమార్ గంధం కృష్ణయ్య,ఉండేకోటి లక్ష్మయ్య,రాజోలి నిరంజన్,ఖాదర్,అచ్చితాపురం విష్ణువర్ధన్ రెడ్డి,శ్రీను,గొర్ల ప్రేమ్,సిరివాటి శంకర్ పాల్గొన్నారు.

## కురుమూర్తి స్వామిని దర్శించుకున్న బిఆర్ఎస్ నాయకులు

**కొత్తకోట,డిసెంబర్ 16,ప్రభాతవార్త:** కురుమూర్తి దేవస్థానంలో శ్రీ వెంకటే శ్వర స్వామిని బిఆర్ఎస్ నాయకులు మాజీ మార్కెట్ కమిటీ డైరెక్టర్ మూల మల్ల వెంకటేశ్వర్ రెడ్డి,కానాయపల్లి నరోత్తం రెడ్డి,భాస్కర్ చారి,రామేశ్వర్ రెడ్డి,రమేష్‌రెడ్డిలు దర్శించుకున్నారు.ముందుగా ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు.తెలంగాణ రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ ఆరోగ్యం తొందరగా కోలుకోవాలని మొక్కులు చెల్లించారు.

## కారు-బైక్ ఢీ : యువకుడి మృతి



ప్రమాదంలో మృతి చెందిన కొరివి రాకేష్

**వెల్దండ, డిసెంబర్ 16 ప్రభాతవార్త:** వెల్దండ మండలం కొట్ర గేటు సమీపం లోని హైదరాబాద్-శ్రీశైలం జాతీయ రహ దారిపై కారు-బైక్ ఎదురెదురుగా ఢీకొన డంతో బైక్‌పై ప్రయాణిస్తున్న యువకుడు మృతి చెందిన సంఘటన శనివారం సాయంత్రం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం. వనపర్తి జిల్లా రేవల్లి మండలం తల్కనూరు గ్రామానికి చెందిన వారు హైదరాబాద్‌కు వెళ్తుండగా, హైదరాబాద్ ఆర్టీసీ క్రాస్ రోడ్డు కాలనీకి చెందిన కొరివి రాకేష్ (30) హైదరాబాద్ నుంచి కల్వకుర్తికి వస్తుండగా కొట్ర గేటు సమీపంలోకారు-బైక్ ఢీకొనడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. సంఘటన స్థలానికి పోలీసులు చేరుకొని మృతదేహాన్ని పోస్టుమార్టం కల్వకుర్తి ప్రభుత్వాసుపత్రికి తరలించారు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. సంఘటనపై కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

# పాత పెన్షన్ విధానం ప్రకటనపై హర్షం

**సిపిఎస్ ఉపాధ్యాయ ఉద్యోగ సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కమలేకర్ నాగేశ్వరరావు**



**ఉప్పునుంతల,డిసెంబరు16 ప్రభాతవార్త:** తెలంగాణ ఉద్యోగులకు సిపిఎస్ విధానాన్ని రద్దుచేసి, పాత పెన్షన్ అమలు చేస్తామని శాసన సభలో ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి ప్రకటించడం పట్ల తెలంగాణ రాష్ర వ్యాప్తంగా సిపిఎస్ ఉపాధ్యాయ ఉద్యోగులు ప్రత్యేకగా అభినందనలు వ్యక్తం చేస్తు న్నట్లు సిపిఎస్ టిఇఎ (టిఎస్) రాష్ట్ర కార్యనిర్వాహక అధ్య క్షుడు కమలేకర్ నాగేశ్వరరావు పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ ఈ అంశాన్ని మేనిపె.స్టోలో చేర్చిన కాంగ్రెస్‌ను సిపిఎస్ ఉపాధ్యాయ ఉద్యోగులు ఏకతాటిపై నిలబడి కాంగ్రెస్ గెలుపుకు కృషి చేయడం పట్ల గత రెండు దశాబ్దాలుగా ఉద్యోగుల పాలిట శాపంగా ఉన్న సమస్యపై ప్రభుత్వం ఏర్పడిన తక్కువ సమయంలోనే ఇంత గొప్ప నిర్ణయం తీసుకోవడం పట్ల వారు కాంగ్రెస్ ప్రభుత్వానికి ప్రత్యేకంగా అభినందనలు తెలిపారు. అందరి జీవితాల్లో వెలుగునింపే పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరణకు సిద్ధమైన ముఖ్య మంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డికి ప్రభుత్వ పాలన రంగంలో పూర్తిస్థాయిలో సహకరించనున్నట్లు సంఘం సభ్యులు మంద రమేష్, అస్రఫ్, రఘు నాథ్‌రెడ్డి, సతీష్, జగదీష్, రాజేష్, లోకేష్ తదితరులు తెలిపారు.

# శనీశ్వరస్వామికి తిల తైల అభిషేక పూజలు

**బిజినేపల్లి,డిసెంబరు 16 ప్రభాతవార్త:** మండల పరిధిలోని నందివడ్డెమాన్ గ్రామంలో మార్గశిరమాసం శనివారం చవితినాడు శ్రీ సార్థా సప్తజేష్ఠ మాత సమేత శనేశ్వరస్వామికి ప్రత్యేకంగా తిల అభిషేకాలు, పూజలు నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకులు డా.గవ్వమఠం విశ్వనాథశాస్త్రి మాట్లాడుతూ శనివాం అష్టమి, నవమి రావడంతో భక్తుల జన్మరిత్యా, గోచార రిత్యా గ్రహదోషాలు తొలగుటకు, శనిగ్రహ శాంతికొరకు శనేశ్వర స్వామిని, నువ్వులనూనె, జిల్లెడుపూలు, జమ్మి ఆకులతో ఈ రోజు పూజిం చారని అన్నారు. పరమశివునికి భక్తులచే రుద్రాభిషేక పూజలు, అర్చనలు ప్రత్యేకంగా నిర్వహించినట్లు ఆయన తెలిపారు.అనంతరం మహా గణపతి స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. వివిధ ప్రాంతాల నుండి వచ్చిన భక్తులు తెల్లవారుజాము నుండి స్వామి వారికి ప్రత్యేకంగా అభిషేకాలు, అష్టోత్తర, అర్చనలు, పూజలు చేశారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ గోపాలరావు, గ్రామ సర్పంచ్ వంగ సుదర్శన్‌గౌడ్, ఆలయ కమిటి సభ్యు లు వీరశేఖర్, ప్రభాకర్, పుల్లయ్య, ఆలయ అర్చకులు గవ్వమఠం శాంతి కుమార్, ఉమామహేశ్వర్, జయంత్, సాయి, గోపాల్‌రెడ్డి పాల్గొన్నారు.



శనీశ్వర స్వామికి పూజలు నిర్వహిస్తున్న భక్తులు

# ఎన్నికల నిర్వహణపై బిఎల్‌ఓలతో సమావేశం

**బిజినేపల్లి,డిసెంబరు 16 ప్రభాతవార్త :** లోక్‌సభ ఎన్నికల నిర్వహణకు అవసరమైన పోలింగ్ బూతుల ఏర్పాటుకు సంబంధించి తహసిల్దార్ జనుంపల్లి శ్రీరాములు శనివారం ఆయా గ్రామాల బిఎల్‌ఓలతో సమావేశం నిర్వహించారు. శుక్రవారం మండలంలో పర్యటించి క్షేత్ర పరిశీలన చేసి అవసరమైనచోట నూతనంగా బూతుల ఏర్పాటుకు మౌలిక సదుపాయాలను పరిశీలించి ప్రణాళిక తయారు చేశారు. లట్టుపల్లి గ్రామ శివారులోని గిరిజన తండాల్లో అసెంబ్లీ ఎన్నికల నిర్వహణకు ఏర్పాటు చేసిన పోలింగ్ బూత్‌లతో పాటు ఇతర ప్రభుత్వ భవనాలను ఎన్నికల నిర్వహణకు అనువుగా ఉన్నాయా లేదా అనే విషయాలపై బిఎల్‌ఓలతో చర్చించారు. విద్యుత్ సౌకర్యం, త్రాగునీరు, పోలింగ్ బూత్‌ల వద్ద ర్యాంపులు ఇతరత్రా అంశాలపై చర్చించారు. అవసరమైన మేరకు పోలింగ్ బూత్ వివరాలు ఉన్నత అధికారులకు నివేదిక ద్వారా అందించనున్నట్లు తెలిపారు. ఎన్నికల నిర్వహణకు వచ్చే అధికారులకు, ఓటర్లకు ప్రయాణానికి అనువుగా ఉండే విధంగా పోలింగ్ కేంద్రాలను క్షేత్ర పరిశీలనలో గుర్తించనున్నట్లు పేర్కొన్నారు. ఆయన వెంట తహసిల్దార్ బాలరాజు, బిఎల్‌ఓలు ఉన్నారు.

# మేలైన పద్ధతులతో అధిక దిగుబడులు

**బిజినేపల్లి,డిసెంబరు 16 ప్రభాతవార్త:** రైతన్నలు మేలైన వ్యవసాయ యాంత్రికరణ పద్ధతులను పాటించి అధిక దిగుబడులను పొందాలని కృషి విజ్ఞాన కేంద్రం కో ఆర్డినేటర్ డా. టి. ప్రభాకర్‌రెడ్డి అన్నారు. కృషి విజ్ఞాన కేంద్రం, ఎన్ఎఫ్ఎస్ఎం జాతీయ పత్తి పరిశోధన స్థానం నాగపూర్ సౌజ న్యంతో వసంతపురం గ్రామంలోని అధిక సాంద్రత పత్తిపైన క్షేత్ర దినోత్సవం నిర్వహించారు. అధిక సాంద్రత పత్తిసాగు వల్ల లాభాలు, మేలైన యాజమాన్య పద్ధతులను క్షుణ్ణంగా వివరించారు. ఈ మొక్క నూతన సాంకేతిక పరిజ్ఞానం రైతులకు ఎంతో లాభసాటిగా ఉంటుంది. పద్ధతి యాంత్రీకరణకు అనువైనదిగా, తక్కువ పంట కాలంలో రెండవ పంటను వేసుకోవడానికి అనువైనదిగా, ముఖ్యంగా గులాబీ రంగు పురు గును ఇతర తెగుళ్ల తాకిడిని తప్పించుకోవచ్చని వివరించారు. శాస్త్రవేత్తలు డిఓ శైలజ, డా.బి.రాజశేఖర్, డా.యన్. లావణ్య, సమగ్ర సస్యరక్షణ యాజమాన్య పద్దతులను, వాతావరణ, ఆధారిత సస్యరక్షణ చర్యలను, ఈ పరిజ్ఞానాన్ని వచ్చే వానకాలానికి ఈ పరిజ్ఞానాన్ని ముందుకు తీసుకుని వెళ్లి మంచి దిగుబడిని సాధించాలని తెలియజేశారు. చివరగా శాస్త్రవేత్తల బృందం వసంతాపూర్ గ్రామంలో వివిధ యాసంగి పంటలైన వరి, మొక్కజొన్న, వేరుశనగ, మిరప, పంటలను సందర్శించి ప్రస్తుతం ఎదు ర్కొంటున్న సమస్యలకు వాటి పరిష్కారాలను తెలియజేశారు. ఈ కార్యక్రమంలో రైతులు కెవికె పాలెం డా. టి. ప్రభాకర్‌రెడ్డి, (ప్రోగ్రాం కో ఆర్డినేటర్, శాస్త్రవేత్తలు) యంగ్ ప్రొఫెషనల్ బృందం పాల్గొన్నారు.



పత్తి పంటను పరిశీలిస్తున్న వ్యవసాయాధికారులు

## క్రీడలలో ఏకశిలా పాఠశాల విద్యార్థుల ప్రతిభ

**ఇటిక్యాల,డిసెంబరు 16 ప్రభాతవార్త :** ఈనెల 14వ తేదీన జిల్లా కేంద్రంలోని ఇండోర్ స్టేడియంలో నిర్వహించిన నేషనల్ ఇంటర్ స్టేట్ అథ్లెటిక్స్ పోటీలలో ముగ్గురు విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. ఏకశిలా పాఠశాలకు చెందిన విద్యార్థిని గీత 14వ విభాగం ట్రయాథ్లాన్ ఈవెంట్లో ప్రతిభ కనబరిచి 2వ స్థానంలో నిలిచింది. అలాగే లాంగ్ జంప్‌లో నందిని 3వ స్థానంలో నందకిశోర్ లాంగ్ జంప్‌లో 4వ స్థానంలో నిలిచారు. ఈ సందర్భంగా పాఠశాల చైర్మన్ తిరుపతిరెడ్డి, డైరెక్టర్ విష్ణువర్ధన్‌రెడ్డి, ప్రిన్సిపల్ రామాంజనేయులు, అడ్మినిస్ట్రేషన్ ఇంఛార్జి శ్రీనివాస్, ఉపాధ్యాయులు హర్షం వ్యక్తం చేసి ప్రతిభ కనబరిచిన విద్యార్థులను అభినందించారు.



ప్రతిభ కనబరిచిన విద్యార్థులను అభినందిస్తున్న ఏకశిలా పాఠశాల చైర్మన్, డైరెక్టర్, ప్రిన్సిపాల్

## మక్తల్ మున్సిపాలిటీని సందర్శించిన అదనపు కలెక్టర్



రికార్డులు పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్

**మక్తల్,డిసెంబరు 16 ప్రభాతవార్త :** మున్సిపాలిటీ పరిధిలో వార్డుల పరిశుభ్రత కార్యక్రమాలు నిర్వహించాలని జిల్లా అదనపు కలెక్టర్ మయాంక్ మిత్తల్ అన్నారు. శనివారం మక్తల్ మున్సిపల్ కార్యాలయాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా హాజరు రిజిస్టర్ తదితర వివరాలు అడిగి తెలుసుకున్నారు. అదేవిధంగా మక్తల్ మున్సిపాలిటీలో తైబజార్ పేరుతో మున్సిపాలిటీ ఆదాయానికి గండి అనే శీర్షికపై కూడా కలెక్టర్ ఆరా తీసినట్లు సమాచారం. మున్సిపాలిటీ పరిధిలో జరుగుతున్న పనులు, పరిశుభ్రత సిబ్బంది పని వివరాలు తెలుసుకున్నారు.ముఖ్యంగా పత్రికల్లో వచ్చిన వార్తలకు గతంలో స్పందిం చని అధికారులు నేడు విస్తృతంగా స్పందిస్తున్నారని ప్రజలంటున్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్, సిబ్బంది పాల్గొన్నారు.

## అతిథి అధ్యాపక నియామకానికి ఆహ్వానం



కళాశాల ప్రిన్సిపల్ డా. ఎస్. విద్యారాణి

**బిజినేపల్లి,డిసెంబరు 16 ప్రభాతవార్త:** పాలెంలో గల శ్రీ వెంకటేశ్వర ప్రభుత్వ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో 2023,2024 విద్యా సంవత్స రానికి డిగ్రీ విద్యార్థులకు ఫిజిక్స్ బోధించేందుకు అతిథి అధ్యాపకులకు అర్హత కలిగిన అభ్యర్థుల నుండి దరఖా స్తులను ఆహ్వానిస్తున్నామని కళాశాల ప్రిన్సిపాల్ డా. ఎస్. విద్యారాణి శని వారం తెలిపారు. ఫిజిక్స్ 1 పోస్టుకు గాను అర్హత కలిగిన అభ్యర్థులు ఈనెల 18న సోమవారం సాయంత్రం 4 గంలలోపు నేరుగా కళాశాలలో పూర్తి బయోడేటాతో దరఖాస్తు చేసుకోవాలని వివరించారు. పిజిలో జన రల్ కేటగిరికి 55 శాతం, ఎస్సీ, ఎస్టీకి 50 శాతం పర్సంటేజీతో పాటు పిహెచ్‌డి, సెట్‌తో పాటు బోధనా అనుభవం కలిగినవారికి మొదటి ప్రాధాన్యత ఇవ్వడం జరుగుతుందని అన్నారు. దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు ఇంటర్వ్యూ తేదిని ఫోన్‌ద్వారా తెలియజేస్తామని తెలిపారు.

## చెస్ టోర్నమెంట్‌లో రాష్ట్ర స్థాయికి ఎంపికైన వైష్ణవి



**నాగర్‌కర్నూల్ ప్రతినిధి,డిసెంబర్ 16 ప్రభాతవార్త:** ఉమ్మడి జిల్లా మహబూబ్‌నగర్‌లో నిర్వ హించిన 67వ ఎస్‌జీఎఫ్ అండర్ -17 ఇయర్స్ చెస్ టోర్నమెంట్ కం సెలక్షన్‌లో నాగర్‌కర్నూల్ జిల్లాకు చెందిన క్రీడాకారిణి వైష్ణవి ఉత్తమ ప్రతిభ కనబరిచి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపి కైంది. ఈ నెల 18న మంచిర్యాల జిల్లాల నిర్వ హించే రాష్ట్ర స్థాయి చెస్ టోర్నమెంట్‌లో పాల్గొంటున్నట్లు జిల్లా విద్యాశాఖ అధికారి డాక్టర్ ఎం.గోవిందరాజులు, జిల్లా ఎస్‌జీఎఫ్ సెక్రటరి పాండు, జిల్లా ఎస్‌పీసీ సెక్రటరీ ప్రసాద్‌గౌడ్, ప్రత్యేకంగా క్రీడాకారుని మరియు కోచ్‌లు ప్రత్యేకంగా అభినందించారు.

## వాల్మీకి మహర్షి విగ్రహ ఆవిష్కరణ



**గద్వాల ,డిసెంబర్ 16,ప్రభాతవార్త :** గట్టు మండల పరిధిలోని అంతం పల్లి గ్రామంలో వాల్మీకి మహర్షి విగ్రహ ప్రతిష్ఠా మహోత్సవ కార్యక్ర మంలో జోగులాంబ గద్వాల జిల్లా పరిషత్ చైర్ పర్సన్ కాంగ్రెస్ పార్టీ గద్వాల అసెంబ్లీ ఇంచార్జీ సరితమ్మ హాజరై పూజా కార్యక్రమాలలో పాల్గొన్నారు..గ్రామస్తులు సరితమ్మను బారీ ఎత్తున స్వాగతం పలికి సన్మానించారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు బండ్ల రాజశేఖరరెడ్డి,సత్యనారాయణ,మధుసూదన్ బాబు,గట్టు కృష్ణ,లత్తిపురం వెంకట్రామిరెడ్డి,రామలింగేశ్వర కాంల్లే,అంతంపల్లి ఆంజనేయులు, రామ కృష్ణ,నరసింహులు,దానయ్య,భాస్కర్‌రెడ్డి,తిమ్మప్ప,ఓంకార్,ప్రకాశ్ గౌడ్,బల్గేర బజారన్న,ముకేరన్న,తుమ్మలపల్లి రవినాయుడు , ఆంజనే యులు,మాచర్ల ప్రకాష్,ఆలూర్ రవి,ఆరగిద్ద బాలకృష్ణ,గురుపద, రమేష్, రాజేష్,సురేష్,బత్తలయ్య,శేఖర్ గౌడ్, వెంకటేష్,ఇసాక్, తిరు మల్,రామకృష్ణ,అల్వాల రాజశేఖర్‌రెడ్డి,సద్దనోముపల్లి గోపాల్, కరాటే, సత్యం,నరేందర్ రెడ్డి,మేడమ్ రామకృష్ణ,సోమశేఖర రెడ్డి, కొండ పల్లి రాఘవేంద్ర రెడ్డి తదితరులు ఉన్నారు.

## కొత్తకోటలో స్కూల్ బస్ డ్రైవర్ అసోసియేషన్ కమిటీ ఎంపిక



ఎస్సైని సన్మానిస్తున్న అసోసియేషన్ సభ్యులు

**కొత్తకోట,డిసెంబర్ 16,ప్రభాతవార్త:** కొత్తకోట శ్రీ వినాయక స్కూల్ బస్ డ్రైవర్ అసోసియేషన్ కమిటీని శనివారం స్కూల్ బస్ డ్రైవర్లు ఏకగ్రీ వంగా ఎన్నుకున్నారు.అధ్యక్షుడుగా శేఖర్ చారి,ఉపాధ్యక్షుడుగా సత్యన్న, ప్రధాన కార్యదర్శి గా అచ్చిరెడ్డి,కార్యదర్శిగా మోహన్ గౌడ్,కోశాధికారిగా ఇలియాజ్,సహాయ కోశాధికారిగా విష్ణుమూర్తి,సలహాదారునిగా విష్ణు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.అసోసియేషన్ కు సంబంధించిన రిజిస్ట్రేషన్ బండ్ పత్రాన్ని ఎస్సై మంజునాథ్ రెడ్డికి అందజేశారు.ముందుగా ఎస్సై ని మర్యాదపూర్వకంగా కలిసి శాలువా పులమలలతో ఘనంగా సన్మా నించారు.ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ యూనియన్ ఉంది అని నమ్మకం కలిగించాలని సూచించారు.స్కూల్ బస్ నడిపేటప్పుడు చాలా జాగ్రత్తగా ఉండాలని ఏ మాత్రం అజాగ్రత్తగా ఉన్న పసి పిల్లల ప్రాణా లకే హాని జరుగుతుందని హెచ్చరించారు.వాహనాలకు సంబంధించిన అన్ని పత్రాలను డ్రైవర్ అందుబాటులో ఉంచుకోవాలని కోరారు.ఈ కార్య క్రమంలో అసోసియేషన్ సభ్యులు నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్న మాజీ ఎంపీపీ

**మల్దకల్, డిసెంబర్ 16,ప్రభాతవార్త:** భక్తులకు ఇలావేల్పుగా నిలుస్తున్న రెండవ తిరుమల తిరుపతి గా పేరుగాంచిన శ్రీ మల్దకల్ తిమ్మప్ప స్వామి దేవాలయంలో దేవాలయ వంశీయులు శ్రీకృష్ణ మాన్య పట్వారీ ప్రహ్లదరావు పర్యవేక్షణలో భక్తులకు ప్రతి శనివారం అన్నదానం ఏర్పాటుచేస్తున్న ఈ కార్యక్రమంలోమాజీ ఎంపీపీ బిజ్వారం వై.సత్యారెడ్డి పాల్గొని అన్నదానం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి శనివారం భక్తులకు ఆలయ కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో అన్నదానం కార్యక్రమం చేపట్టడంభక్తులకు స్వామి వారి దైవ ప్రసాదంగా భావిస్తారని అన్నారు. ఈ కార్యక్రమంలో చంద్రశేఖర్ రావు, వీరారెడ్డి, సీనియర్ జర్నలిస్టు శ్రీనివాసులు, ఆలయ సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.

## విద్యార్థుల్లో సృజనాత్మకతను వెలికితీయాలి

- ఉదయ్ మెమోరియల్ హై స్కూల్ ప్రిన్సిపల్ వీణ
- ఆకట్టుకున్న చిన్నారుల ఫ్యాన్సీ డ్రెస్ కాంపిటీషన్



**మహబూబ్‌నగర్ బ్యూరో, డిసెంబరు 16 ప్రభాత వార్త:** విద్యార్థుల్లో ఉన్న సృజనాత్మకతను వెలికి తీయాలని ఉదయ మెమోరియల్ హై స్కూల్ ప్రిన్సిపల్ వీణ తెలిపారు. జడ్చర్ల మండల కేంద్రం లోని చంద్ర గార్డెన్ ఫంక్షన్ హాల్‌లో శనివారం నిర్వహించిన ఫ్యాన్సీ డ్రెస్ కాంపిటీషన్‌లో చిన్నారులు వారి ప్రతిభను ప్రదర్శించారు. వివిధ వేషధారణలో అందరిని ఆకట్టుకున్నారు. కార్య క్రమంలో ప్రిన్సిపాల్ వీణ, వైస్ ప్రిన్సిపాల్ నందిని, ఉపాధ్యాయులు అన్నపూర్ణ, శశికళ, శోభ మరియు మిగతా ఉపా ధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.







# 54 లక్షల నల్ల కనెక్షన్లు ఇచ్చాం

**12 లక్షల గ్యాస్ కనెక్షన్లు ఇచ్చాం**

**మెరుగైన జీవన ప్రమాణాలు అందిస్తాం**

**కేంద్ర భారీ పరిశ్రమల శాఖ మంత్రి మహేంద్రనాథ్ పాండే**

**వికసిత్ భారత సంకల్పయాత్ర వాహనం ప్రారంభం**

**బాలానగర్ మండలం పెద్దయిపల్లిలో పర్యటన**

**మహబూబ్‌నగర్ బ్యూరో, డిసెంబరు 16 ప్రభాతవార్త:** దేశంలోని ప్రజలం దరికి 2047 నాటికి మెరుగైన జీవన ప్రమాణాలు అందించడం ద్వారా అన్ని రకాలుగా దేశాన్ని అభివృద్ధి చేయాలన్నదే కేంద్ర ప్రభుత్వ లక్ష్యమని కేంద్ర భారీ పరిశ్రమల శాఖ మంత్రి డా. మహేంద్రనాథ్ పాండే అన్నారు. శనివారం ఆయన మహబూబ్‌నగర్ జిల్లా బాలానగర్ మండలం పెద్దాయ పల్లి గ్రామంలో కేంద్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో కేంద్ర ప్రభుత్వ పథకాలపై అవగాహనకై ఏర్పాటు చేసిన వికసిత్ భారత్ సంకల్పయాత్ర వాహనాన్ని జెండా ఊపి ప్రారంభించారు. అంతకు ముందు దేశ ప్రధాని నరేంద్రమోడీ శాసనసభ ఎన్నికల కారణంగా వికసిత్ భారత్ సంకల్పయాత్ర కార్యక్ర మాన్ని ప్రారంభించ లేకపోయిన రాష్ట్రాలలో ఈ కార్యక్రమాన్ని జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయా రాష్ట్రాల ప్రజలనుద్దేశించి ప్రధానమంత్రి ప్రసంగించిన అనంతరం కేంద్ర భారీ పరిశ్రమల శాఖ మంత్రి మహేంద్రనాథ్ పాండే పెద్దాయపల్లిలో మాట్లాడారు. దేశంలోని ప్రతి పౌరుడు అభివృద్ధి చెందాలన్న సంకల్పంతో 2047 నాటికి ప్రజల ందరికి మెరుగైన జీవన ప్రమాణాలు అందించాలన్న ఉద్దేశంతో వికసిత్ భారత్ సంకల్ప కేంద్ర ప్రభుత్వం ద్వారా అమలు చేస్తున్న పథకాలను వివరించడమే కాకుండా కొత్త లబ్దిదరులను ఈ పథకాల కింద గుర్తించి వారికి లబ్ది చేకూర్చాలన్న ఉద్దేశం ముఖ్యం అని తెలిపారు. నవంబర్ 15న జార్ఖండ్‌లో కార్యక్రమం ప్రారంభమైందని, కొత్తగా ప్రారంభమైన 4 రాష్ట్రా లలో జనవరి 26 వరకు ఈ కార్యక్రమంలో కొనసాగుతుందని తెలిపారు. జడ్చర్ల నియోజకవర్గంలో ఎక్కువమంది గిరిజనులు ఉన్న దృష్ట్యా ఈ కార్యక్రమాన్ని పెద్దాయపల్లిలో ప్రారంభిస్తున్నట్లు మంత్రి తెలిపారు. దేశంలోని 270 జిల్లాలలో గిరిజనులు ఎక్కువగా ఉన్నారని, ఈ సంద ర్భంగా మంత్రి కేంద్ర ప్రభుత్వం ద్వారా అమలు చేస్తున్న వివిధ పథకాల కింద లబ్ది పొందిన లబ్దిదారుల గురించి వివరిస్తూ ప్రధానమంత్రి ఉజ్వల పథకం కింద తెలంగాణలో 12 లక్షల ఎల్పీజి గ్యాస్ కనెక్షన్లను ఇవ్వడం



జెండా ఊపి వాహనాలను ప్రారంభిస్తున్న కేంద్ర మంత్రి మహేంద్రనాథ్ పాండే



జరిగిందని, ప్రధానమంత్రి ఆవాస్ యోజన కింద రెండున్నర లక్షల మందికి లబ్ధి కలిగించామని, హర్‌ఘర్ జల్‌కింద 54 లక్షల ఇళ్లకు నల్ల కనెక్షన్లు ఇవ్వడం జరిగిందని కేంద్ర మంత్రి తెలిపారు. పీఎం స్వనిధి కింద 881 కోట్ల రూపాయల ఆర్థిక సాయం అందించామని, ఆయుష్మాన్ భారత్ కింద 5 లక్షల భీమా చేయించుకున్న వారు 50 కోట్ల మంది దేశంలో కవర్ అయ్యారని తెలిపారు. దేశంలోని 120 జిల్లాలలో జన ఔషధ ద్వారా ప్రజలు లబ్ధి పొందుతున్నారని, పీఎం ముద్ర కింద 51 కోట్ల మందికి ఆర్థిక సహాయం అందించడం జరిగిందని మంత్రి వివరించారు. జిల్లా కలెక్టర్ జి.రవినాయక్ మాట్లాడుతూ వికసిత్ భారత్ సంకల్పయాత్ర ద్వారా మహబూబ్‌నగర్ జిలాలలో 6 వాహనాల ద్వారా అన్ని గ్రామాలను కవర్ చేయడం జరుగుతుందని వీడియోలు, కరపత్రాల ద్వారా ప్రజలకు తెలియజేసి ఆయా పథకాల కింద లబ్ధిపొందేలా చేస్తామని తెలిపారు. కేంద్ర ప్రభుత్వ డిఫెన్స్ జాయింట్ సెక్రెటరీ వేదవీర్ ఆర్య, స్థానిక సంస్థల ఇంఛార్జి అదనపు కలెక్టర్ యాదయ్య, మాజీ ఎమ్మెల్యే డికె అరుణ, జిల్లా అధికారులు హాజరయ్యారు.

## శ్రీకురుమూర్తి స్వామిని దర్శించుకున్న జిల్లా జడ్జి

**చిన్నచింతకుంట, డిసెంబరు16 ప్రభాతవార్త:** తిరుమల తిరుపతి వెంకటేశ్వ రుడి ప్రతిరూపంగా కొలవబడుతున్న శ్రీ కురుమూర్తి స్వామిని శనివారం జిల్లా జడ్జి పాపిరెడ్డి దంపతులు దర్శించుకున్నారు. ఉదయం ఆలయానికి చేరుకుని కొండపై గల ముఖద్వారం వద్దకు రాగానే ఆలయ మర్యాదలో భాగంగా జిల్లా జడ్జి దంపతులకు ఆలయ అర్చకులు మంగళవాయిద్యాలు నడుమ పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. అక్కడి నుంచి నేరుగా స్వామి వారి ప్రధానాలయంలో శ్రీ కురుమూర్తి స్వామిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. వేద పండితులు జిల్లా జడ్జి పాపిరెడ్డి దంపతులకు ఆశీర్వ చనాలు అందించారు. అక్కడి నుండి నేరుగా ఉద్దాల మండపానికి చేరుకుని స్వామివారి పాదుకలను తాకి పునీతులయ్యారు. వీరివెంట ఎస్సై ఆర్. శేఖర్, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

## మొక్కు చెల్లింపుకై తిరుపతికి పాదయాత్ర

**చిన్నచింతకుంట, డిసెంబరు 16 ప్రభాతవార్త:** రాష్ట్ర ముఖ్యమంత్రిగా రేవం త్‌రెడ్డి నియమింపబడాలని మొక్కులో భాగంగా కొడంగల్ నుంచి తిరుపతికి పాదయాత్రగా కాంగ్రెస్ నేతలు బయలుదేరారు. శనివారం మండలంలో నెల్లికొండి గ్రామం మీదుగా పాదయాత్ర కొనసాగిస్తుండగా ప్రభాతవార్త పలకరించగా రేవంత్‌రెడ్డి సీఎంగా బాధ్యతలు చేపట్టడంతో తిరుమల తిరు పతి వెంకటేశ్వరునికి మొక్కు చెల్లించేందుకుగాను కొడంగల్ నుంచి తిరు పతికి పాదయాత్ర చేస్తున్నామని వికారాబాద్ జిల్లా దౌల్తాబాద్ మండల యూత్ వర్కింగ్ ప్రెసిడెంట్ మహిపాల్ ముదిరాజ్, బాలంపేట గ్రామ కమిటి అధ్యక్షులు నరసింహులు ముదిరాజ్‌లు తెలిపారు.

## బీపీ షుగర్ పేషెంట్లకు ఫాలో పూర్తి చేయండి

**మల్దకల్, డిసెంబర్ 16 ప్రభాతవార్త:** జోగులాంబ గద్వాల్ జిల్లా మల్దకల్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని ఉలిగపల్లి హెచ్‌డబ్ల్యూసి సెంటర్ ను జిల్లా ప్రోగ్రాం కోఆర్డినేటర్స్ శ్యాంసుందర్ మక్షుద్ సందర్శించి యంఎ ల్‌హెచ్‌పి సామధానమ్మ బయోమెట్రిక్ ద్వారా చేస్తున్న ఎబిహెచ్ఎ కార్డు క్రియేషన్ పరిశీలించారు. క్రియేషన్ చేయటంలో ఎలాంటి ఇబ్బంది లేవని త్వరగా పూర్తి చేస్తామని తెలియజేశారు. గ్రామాలలో మిగిలినవన్నీ కూడా త్వరగా పూర్తి చేయాలని తెలిపారు. ఆశా కార్యకర్తల రికార్డు నందు ఎబిహెచ్ఎ నెంబర్లు వ్రాసుకోవాలని బిపి షుగర్ వారికి 10వ తారీకు లోపు పరీక్షలు చేసి మందులు ఇవ్వాలని తెలిపారు. కాంబినేషన్ మందులు అవ సరమైన వారికి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం మల్దకల్ నందు ఇప్పించాలని తెలి పారు. అదే విధంగా టెలి మానస్ కాల్స్ 14416 కు మానసిక ఆరోగ్య సమస్యలతో బాధపడుతున్న వారికి టోల్ ఫ్రీ నెంబర్ ద్వారా చేపించి వారికి ఉపశమనం పొందేలా చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో హెల్త్ అసిస్టెంట్ జయరాం ఆశాకార్యకర్తలు పాల్గొన్నారు.

## వ్యక్తి అదృశ్యం... కేసు నమోదు

**కల్వకుర్తి, డిసెంబర్ 16 ప్రభాతవార్త:** వంగూరు మండలం పోల్కంపల్లి గ్రామానికి చెందిన కీరమోని నరసింహులుగౌడ్ అదృశ్యమైన సంఘటన కల్వకుర్తి పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోల్కంపల్లి గ్రామానికి చెందిన నరసింహులుగౌడ్ కల్వకుర్తి పట్టణంలోని జేపీనగర్ వద్ద ఉన్న ఇండియన్ పెట్రోల్ బంక్‌లో పనిచేస్తున్నాడు. నవంబర్ మొదటి వారంలో జీతం డబ్బులు తీసుకొని తిరిగి ఇంటికి వెళ్తున్నానని బంక్ యాజమాన్యానికి సూచించి ఇప్పటి వరకు ఇంటికి చేరుకోలేదు. దీంతో కుటుంబ సభ్యులు, బంక్ యాజమాన్యం చుట్టు ప్రక్కల గ్రామాల్లో వెతికిన కనిపించకపోవడంతో కుటుంబ సభ్యులతో కలిసి బంక్ యాజమాన్యం కల్వకుర్తి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసలు తెలిపారు. ఈ వ్యక్తి ఎక్కడైన కనిపిస్తే ఈ నెంబర్లకు 9963975671, 9014673776 సమాచారమివ్వాలని, సమా చారమిచ్చిన వారికి తగిన పారితోషికం అందజేస్తామని కుటుంబ సభ్యులు పేర్కొన్నారు.

## ఉద్యోగులకు ప్రభుత్వ నిర్ణయం హర్షణీయం

**ఇటిక్యాల, డిసెంబరు16 ప్రభాతవార్త:** దీర్ఘకాలంగా ఉద్యోగ ఉపాధ్యా యులు పాత పెన్షన్ విధానం అమలు చేయాలని ఎన్నో పోరాటాలు చేశారని అలాంటి ఉద్యోగ ఉపాధ్యాయులకు కాంగ్రెస్ ప్రభుత్వం అసెంబ్లీలో కొత్త పెన్షన్ విధానం తీసివేసి పాత పెన్షన్ విధానంపై అలాగే పెండింగ్ లో ఉన్న 3 డిఎలు ప్రకటన అదేవిధంగా ఆరు నెలలోపు ఉద్యోగ ఉపాధ్యాయులకు కొత్త పిఆర్సీని అమలు చేస్తామని చెప్పడం హర్షణీ యమైనదని టిఎస్‌టియు జోగులాంబ గద్వాల జిల్లా అధ్యక్షులు ఆర్. రమేష్‌కుమార్, ప్రధాన కార్యదర్శి మల్లికార్జున్లు ఒక ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు.

## వ్యవసాయ యాంత్రికరణ పద్ధతులను పాటించి అధిక దిగుబడులను పొందాలి

**బిజినేపల్లి, డిసెంబరు 16 ప్రభాతవార్త:** రైతన్నలు మేలైన వ్యవసాయ యాంత్రికరణ పద్ధతులను పాటించి అధిక దిగుబడులను పొందాలని కృషి విజ్ఞాన కేంద్రం కో ఆర్డినేటర్ డా. టి. ప్రభాకర్‌రెడ్డి అన్నారు. కృషి విజ్ఞాన కేంద్రం, ఎన్ఎఫ్ఎస్ఎం జాతీయ పత్తి పరిశోధన స్థానం నాగపూర్ సౌజ న్యంతో వసంతపురం గ్రామంలోని అధిక సాంద్రత పత్తిపైన క్షేత్ర దినోత్సవం నిర్వహించారు. అధిక సాంద్రత పత్తిసాగు వల్ల లాభాలు, మేలైన యాజమాన్య పద్ధతులను క్షుణ్ణంగా వివరించారు. ఈ మొక్క నూతన సాంకేతిక పరిజ్ఞానం రైతులకు ఎంతో లాభసాటిగా ఉంటుంది. పద్దతి యాంత్రీకరణకు అనువైనదిగా, తక్కువ పంట కాలంలో రెండవ పంటను వేసుకోవడానికి అనువైనదిగా, ముఖ్యంగా గులాబీ రంగు పురు గును ఇతర తెగుళ్ల తాకిడిని తప్పించుకోవచ్చని వివరించారు. శాస్త్రవేత్తలు డిఓ శైలజ, డా.బి.రాజశేఖర్, డా.యన్. లావణ్య, సమగ్ర సస్యరక్షణ యాజమాన్య పద్ధతులను, వాతావరణ, ఆధారిత సస్యరక్షణ చర్యలను, ఈ పరిజ్ఞానాన్ని వచ్చే వానకాలానికి ఈ పరిజ్ఞానాన్ని ముందుకు తీసుకుని వెళ్లి మంచి దిగుబడిని సాధించాలని తెలియజేశారు. చివరగా శాస్త్రవేత్తల బృందం వసంతాపూర్ గ్రామంలో వివిధ యాసంగి పంటలైన వరి, మొక్కజొన్న, వేరుశనగ, మిరప, పంటలను సందర్శించి ప్రస్తుతం ఎదు ర్కొంటున్న సమస్యలకు వాటి పరిష్కారాలను తెలియజేశారు. ఈ కార్యక్రమంలో రైతులు కెవికె పాలెం డా. టి. ప్రభాకర్‌రెడ్డి, (ప్రోగ్రాం కో ఆర్డినేటర్, శాస్త్రవేత్తలు) యంగ్ ప్రొఫెషనల్ బృందం పాల్గొన్నారు.

# తెలంగాణలో సేవలు చేయడం సంతోషం

**మహబూబ్‌నగర్ స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ శివేంద్ర ప్రతాప్**

**పుష్పగుచ్ఛం అందజేసి ఆహ్వానించిన కలెక్టర్ జి. రవినాయక్**



**మహబూబ్‌నగర్ బ్యూరో, డిసెంబరు 16 ప్రభాతవార్త :** ఉత్తరప్రదేశ్ రాష్ట్రం నుంచి వచ్చి తెలంగాణ రాష్ట్రంలో ప్రజలకు సేవలందించడం సంతోషంగా ఉందని మహబూబ్‌నగర్ జిల్లాకు నూతనంగా నియమించబడిన స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ శివేంద్ర ప్రతాప్ అన్నారు. శనివారం ఆయన మహ బూబ్‌నగర్ జిల్లా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్‌గా బాధ్యతలను స్వీకరించిన అనంతరం జిల్లా కలెక్టర్ జి. రవినాయక్‌ను మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తాను ఉత్తరప్రదేశ్ రాష్ట్రంలోని ఉన్నవ్ జిల్లా నుండి రావడం జరిగిందని, వెల్లూరు వీఐటిలో బిటెక్ పూర్తి చేశానని, ఐఎం బెంగుళూరులో ఎంబిఎ పూర్తి చేసినట్లు తెలిపారు. గురుగావ్ సిటి బ్యాంకులో ఒక సంవత్సరం పని చేయడం జరిగిందని గుజరాత్ రాష్ట్రంలోని గిఫ్ట్‌సిటీ గాంధీనగర్‌లో ఐఎఫ్ఎస్‌సి అథారిటీగా పని చేశానని, అనంతరం 2021 బ్యాచ్ ఐఎఎస్ అధికారిగా కామా రెడ్డిలో మొదటిశిక్షణ పొందడం జరిగిందని, రెండు సంవత్సరాల శిక్షణ అనంతరం ఇటీవలే ముస్సోరిలో శిక్షణ పూర్తి చేసుకుని వచ్చానని వెల్లడించారు. మహబూబ్‌నగర్ జిల్లాలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్‌గా మొదటి పోస్టింగ్ రావడం గతంలో ఉత్తర తెలంగాణలో శిక్షణ సందర్భంగా పనిచేసిన అనుభవం, ఇప్పుడు దక్షిణ తెలంగాణలో అదనపు కలెక్టర్‌గా సేవలందించేందుకు నియమించడం పట్ల ఆయన సంతోషాన్ని వ్యక్తం చేశారు. ముఖ్యంగా తాను పరిపాలన పరంగా అన్ని విషయాలు తెలంగాణ రాష్ట్రంలో నేర్చుకోవడం తనకు ఆనందంగా ఉందని తెలిపారు.

## పట్టణానికి దూరంగా డంపింగ్‌యార్డ్‌ను ఏర్పాటు చేయాలి

**కల్వకుర్తి, డిసెంబర్16 ప్రభాతవార్త:** కల్వకుర్తి పట్టణంలోని హరిహ రటౌన్‌షిప్ వెనుక భాగంలో ఏర్పాటు చేసిన డంపింగ్‌యార్డ్‌ను పట్టణానికి దూరంగా ఏర్పాటు చేయాలని కల్వకుర్తి మాజీ సర్పంచ్ బ్రుంగి ఆనంద్ కుమార్ పేర్కొన్నారు. శనివారం డంపింగ్‌యార్డ్‌లో డంప్ చేసిన చెత్తను కాల్చడం వల్ల వస్తున్న పొగ వల్ల ఆరోగ్య సమస్యలు తలెత్తుతున్నాయని డంప్ యార్డ్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కల్వకుర్తి పట్టణంలో గత కొన్ని రోజులుగా సేకరిస్తున్న చెత్తను హరిహర టౌన్ షిప్ వెనుకాల ఖాళీ స్థలంలోని డంపింగ్ యార్డ్‌లో డంప్ చేసిన చెత్తను తగలబెట్టడంతో చెత్త నుంచి వస్తున్న పొగ వల్ల పలు కాలనీల్లోకి పొగ చేరి చిన్న పిల్లలు, వృద్ధులు అనారోగ్య సమస్యలతో బాధప డుతున్నారని పలుమార్లు మున్సిపల్ కమిషనర్ దృష్టికి తీసుకెళ్లారని సూచించారు. మున్సిపల్ కమిషనర్ స్పందించి డంపింగ్ యార్డ్‌ను తర లించి పట్టణ ప్రజల ఆరోగ్యాన్ని కాపాడాలని, లేని యెడల పెద్ద ఎత్తున



డంపింగ్‌యార్డ్ నుంచి వస్తున్న పొగను పరిశీలిస్తున్న దృశ్యం

కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఉద్యమం చేస్తామన్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ సుదర్శన్‌రెడ్డి, కౌన్సిలర్లు బాలునాయక్, ఏజాస్, కాంగ్రెస్ నాయకులు చంద్రకాంత్‌రెడ్డి, మక్బూల్, జమ్ముల శ్రీకాంత్, అబ్దుల్ సుభాని తదితరులు ఉన్నారు.

## పదవ తరగతిలో విద్యార్థులు మంచి ఫలితాలు సాధించాలి

**ఇటిక్యాల, డిసెంబరు 16 ప్రభాతవార్త:** విద్యార్థులు బాగా చదువుకొని పదవ తరగతిలో మంచి మార్కులు సాధించాలని విద్యార్థులను క్రమం తప్పకుండా పాఠశాలలకు పంపాలని విద్యార్థుల తల్లిదండ్రులకు జిల్లా విద్యాధికారి సిరాజు ద్దిన్ వివరించారు. శనివారం మండల పరిధిలోని కొండేరు గ్రామంలో గల ఉన్నత పాఠశాలలను డిఈఓ సిరాజుద్దిన్ సందర్శించారు. ఈ సందర్భంగా పాఠశాలలో ఏర్పాటు చేసిన విద్యార్థుల తల్లిదండ్రుల సమావేశానికి ఆయన హాజరయ్యారు. అనంతరం డీఈఓ మాట్లాడుతూ పిల్లలను పనికి పంపరాదని, ఇంటిదగ్గర కూడా పిల్లలు చదువుకునే చూడాలని ప్రభుత్వ పాఠ శాలలో కూడా విద్యార్థులకు అన్ని రకాల సదుపాయాలు కల్పించిందన్నారు. ఉపాధ్యాయులు చెప్పే ప్రతి అంశాన్ని విద్యార్థులు శ్రద్ధగా వినాలని ప్రత్యేక తరగతులకు కూడా అందరు విద్యార్థులు హాజరు కావాలని సూచించారు.



విద్యార్థులతో మాట్లాడుతున్న జిల్లా విద్యాధికారి సిరాజుద్దిన్

ఉపాధ్యాయులు ఖచ్చితమైన పాఠ్య ప్రణాళిక ఆధారంగా బోధన చేయాలని ఉపాధ్యాయులు నిర్వహించే కార్యక్రమాలను డైరీలలో పొందుపరచాలని సూచించారు. పాఠ్య ప్రణాళికలు ఉపాధ్యాయుల డైరీలను ఉన్నతి బేసిక్ టెస్టులను ఆయన పరిశీలించారు. అదే విధంగా పాఠశాలలో రాగిజావా కార్యక్ర మాన్ని పరిశీలించారు. ఎంఈఓ రాజు, పాఠశాల జిహెచ్ఎం అమీర్‌పాషా, సర్వశిక్ష అభయాన్ అధికారి అంపయ్య, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## నేడు క్యాంప్ కార్యాలయంలోకి ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి

**మక్తల్, డిసెంబరు 16 ప్రభాతవార్త:** పట్టణంలోని బస్టాండ్ సమీపంలో ఉన్న ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలోకి ఆదివారం ఉదయం మక్తల్ ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి అడుగు పెట్టనున్నారు. అందుకొరకు కార్యాలయాన్ని మామిడి తోరణాలతో, రంగు రంగుల విద్యుత్ దీపాలతో అలంకరి ంచారు. ఆదివారం ఉదయ 7 గం.ల నుండి 9 గం.ల వరకు జరిగే లక్ష్మిపూజ, గణపతి హోమం లో ఎమ్మెల్యే దంపతులు పాల్గొని క్యాంపు కార్యాలయంలోకి అడుగు పెట్టనున్నారు. గత ప్రభుత్వ ంలో ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం పెద్దగా ప్రజలకు అందుబాటులోకి రాలేదని విమర్శలు ఉన్నాయి. అడపా దడపా చెక్కుల పంపిణీ, పంద్రాగస్టు, 26 జనవరి లాంటి కార్యక్రమాలకే పరిమితం కావడంతో ప్రజలు తమ సమస్యల కోసం గతంలో ఎమ్మెల్యే నివాసానికి వెళ్లేవారు. అయితే కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రావడంతో ప్రజా దర్బార్‌లను రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహిస్తోంది. అందులో భాగంగా మక్తల్ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం సైతం బస్టాండ్‌కు ఆనుకుని ఉండడంతో ప్రజలకు మరింత వెసలుబాటు ఉంటుంని, నిత్యం ప్రజలతో మమేకమై వారి సమస్యల పరిష్కారానికి కృషిచేసే విధంగా ప్రణాళికలు రూపొందిస్తున్నారు. మొత్తం మీద కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడంతో ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయానికి సరికొత్త శోభ వచ్చినట్లయిందని స్థానిక ప్రజలు చర్చించుకుంటున్నారు.



ఎమ్మెల్యే కార్యాలయాన్ని విద్యుత్ దీపాలతో అలంకరించిన దృశ్యం

# నీటిపారుదల శాఖ ఏఈపై దాడిని ఖండిస్తూ ధర్నా

**ఉండవెల్లి, డిసెంబరు 16 ప్రభాతవార్త:** మానవపాడు శివారుల ఆర్డీఎస్ మెయిన్ కాలువపై మానవపాడుకు చెందిన ఓ వ్యక్తి అక్రమ నీటి మోటా రు వాడుతూ కాల్వపై సర్వీస్ రోడ్డును తవ్వి, రాళ్లు అడ్డంపెట్టి రాకపో కలకు అంతరాయం కలిగించడంతో ఆ వ్యక్తిని నీటిపారుదల శాఖ అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ వరుణ్‌కుమార్ ప్రశ్నించడంతో అకార ణంగా ఏఈని దూషిస్తూ గొడవపడ్డారు. అక్కడి నుండి మానవపాడు దారి గుండా శాంతినగర్ వెళ్లే దారిలో సదరు వ్యక్తి ఫోన్ ద్వారా మానవపాడు గ్రామానికి చెందిన కొందరికి సమాచారం ఇవ్వడంతో వాళ్ల మనుషులు మానవపాడు నడి గ్రామంలో రోడ్డుపై అడ్డగించి ఏఈఈ వరుణ్‌కుమార్‌ను కొట్టారు. తీవ్రమైన గాయాలతో ఆసుపత్రిలో చేరారు. ఇప్పటివరకు వారి ఆరోగ్య పరిస్థితి నిలకడగా లేదని వైద్యులు సూచించారు. అయితే శనివారం మానవపాడు పోలీస్ స్టేషన్‌లో ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ విజయ్ కుమార్‌రెడ్డి స్టేషన్‌లో కేసు పెట్టడం జరిగింది. నీటి పారుదల శాఖ ఉద్యోగులు మధ్యాహ్నం భోజన విరామ సమయంలో సర్కిల్ ఆఫీసు, సిఈ ఆఫీసులలో ధర్నా కార్యక్రమాన్ని నిర్వహించి నిరసన తెలిపారు. భవిష్యత్తులో ఇలాంటి దాడులను ఖండిస్తూ, ఉద్యోగులపై ఇలాంటి నీచ



మైన చర్యలను తీవ్రంగా నిరసిస్తూ ఇలాంటి భయభ్రాంతులకు గురి చేసిన సదరు వ్యక్తులపై చట్టపమైన చర్యలు తీసుకొనుటకు వల్లూరు క్రాంతి జిల్లా కలెక్టర్‌కు, చీఫ్ ఇంజనీర్ రఘునాథరావుకు, పర్యవేక్షక ఇంజనీర్ ఇరిగేషన్ సర్కిల్ ఎస్సీపీ శ్రీనివాసరావుకి వినతి పత్రాలు ఇస్తూ, దోషుల ను అరెస్టు చేసేంతవరకు దశల వారి ఉద్యమం చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో రాష్ట్ర టెక్నికల్ అసోసియేషన్ అధ్యక్షులు వెంకటరాజారెడ్డి, జిల్లా సెక్రెటరీ బీజాపూర్ ఆనంద్, విష్ణు సహాధ్యక్షులు సతీష్‌కుమార్ అధ్యక్షులు, ఏఈఈ అసోసియేషన్ వివిధ డివిజన్ సిబ్బంది పాల్గొన్నారు.

## భక్తి శ్రద్ధలతో అయ్యప్ప పడిపూజ

**లింగాల, డిసెంబరు 16 ప్రభాతవార్త :** మండల పరిధిలోని కొత్తకుంటపల్లి గ్రామంలోని అయ్యప్పస్వామి అప్పల బాలరాజుగౌడ్ ఇంటి ఆవరణలో అయ్యప్ప పూడిపూజ కార్యక్రమం భక్తి శ్రద్ధలతో వైభవంగా జరిగింది. ఈ సందర్భంగా గురుస్వాములు భగవాన్, జెసిబి శ్రీనివాసులు, గోపినాయక్ ఆధ్వర్యంలో నిర్వహించిన అయ్యప్ప పడిపూజ కార్యక్రమానికి వివిధ ప్రాం తాల నుంచి బంధుమిత్రులు రావడంతో ఆవరణలో అయ్యప్ప పాటలతో అయ్యప్ప నామస్మరణలో మారుమోగింది. స్వామివారికి అభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం స్వామివారికి అన్నదాన కార్య క్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా గురుస్వాములు మాట్లాడుతూ ప్రజలు ఆధ్యాత్మిక దైవచింతన అలవర్చుకోవాలని ఆధ్యాత్మిక చింతల ద్వారా మానసిక చింతన పెరుగుతుందన్నారు. కార్యక్రమంలో అయ్యప్ప స్వాములు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## ఆటో యూనియన్ ఆధ్వర్యంలో నిరసన ర్యాలీ



**లింగాల, డిసెంబరు 16 ప్రభాతవార్త :** కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన మహాలక్ష్మి పథకంతో ఆటో డ్రైవర్లు మేం రోడ్డున పడ్డామని శనివారం లింగాల మండల కేంద్రంలో ఆటో యూనియన్ ఆధ్వర్యంలో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మండల కేంద్రంలోని ఆటో యూనియన్ ఆధ్వర్యంలో 30 పైచిలుకు ఆటోలతో ప్రధాన వీధుల గుండా ర్యాలీ నిర్వ హించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజా సంక్షేమ పాలన అందించాల్సిన ప్రభుత్వం ఆటో డ్రైవర్ల పొట్టకొట్టడం సరికాదన్నారు. బస్సులో మహిళలకు ఉచితంగా ప్రయాణం కల్పించడంతో ఆటోలో ఎవరు ప్రయాణించడం లేదని తమకు పూట గడవడం కష్టంగా మారిం దని ఆందోళన వ్యక్తంచేశారు. రాష్ట్రంలో వేలాది అప్పులుచేసి ఆటోలు ఫైనాన్స్‌లోకొనుగోలు చేసికుటుంబాలను పోషించుకుంటున్నట్లు తెలిపారు. మహిళలకు ఫ్రీ సౌకర్యం కల్పించడతో ఆటోలో ఎవరూ ఎక్కకపోవడంతో కనీసం ఫైనాన్స్‌తో పాటు పూట గడవడం కష్టంగా మారిందని తెలిపారు. ప్రభుత్వం ఆటోడ్రైవర్లు పడుతున్న ఇబ్బందులను గుర్తించి అన్ని విధాలుగా ఆదుకోవాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో యూనియన్ తరఫున పోరా టాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఆటో యూనియన్ సభ్యులు శరబందు, నాగరాజు, శివ, వెంకటయ్య, ప్రవీణ్, శెలిపైల్వాన్, శేఖర్, హన్మంతు మల్లేష్ పాల్గొన్నారు.

## నేటి నుండి ధనుర్మాస ఉత్సవాలు



**బిజినేపల్లి, డిసెంబరు 16 ప్రభాతవార్త:** వట్టెం శ్రీ వెంకటేశ్వరస్వామి దేవ స్థానంలో వైష్ణవ సాంప్రదాయంలో అత్యంత పవిత్రమైన ధనుర్మాస ఉత్స వాలు ఆదివారం నుంచి ప్రారంభం కానున్నాయి. ధనుర్మాస ఉత్సవాల్లో శ్రీ వెంకటేశ్వరస్వామి దేవస్థానంలో మొదటిరోజు గోదా అమ్మవారి తిరుమంజనం 23న వైకుంఠ ఏకాదశి సందర్భంగా ఉత్తరద్వార దర్శనం నక్షత్రహారతి ఉత్సవ విగ్రహాలను వట్టెం గ్రామంలో తిరువీధి ఉత్సవం నిర్వహిస్తారు. జనవరి 12న కూడారై ఉత్సవం లాంటి ప్రత్యేక పూజలు నెలరోజులపాటు వైభవంగా నిర్వహించబడును. ద్వాపర యుగంలో గోపికలు శ్రీకృష్ణ పరమాత్మను చేరుటకు కాత్యాయని వ్రతమాచరించి మోక్షసిద్ధి పొందారు. అదేవిధంగా కలియుగంలో లోకకళ్యాణార్థం శ్రీ గోదాదేవి 30రోజులు భక్తులను కలుపుకుని వ్రతమాచరించారు. 30 రోజు లు 30 పాశురములో పరుషముల పాడి 30 రోజున శ్రీ రంగనాథ స్వామిలో ఐక్యమైనది. ప్రత్యేకంగా వివాహం కాని కన్యలు గోదా కళ్యాణం లో పాల్గొని గోదాదేవి యొక్క ప్రసాదం స్వీకరించిన కళ్యాణం జరుగునని ఆలయ అర్చకులు తెలిపారు.

## శ్రీతిమ్మప్ప స్వామి బ్రహ్మోత్సవాల బ్రోచర్ విడుదల

**మల్దకల్ డిసెంబర్ 16, ప్రభాతవార్త:** నడిగడ్డ భక్తుల ఇలవేల్పు అయిన ఆదిశిలా క్షేత్రం శ్రీ స్వయంభు లక్ష్మి వెంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలు ఈ నెల 17 నుండి ప్రారంభం కానున్నాయి. ఇందుకు సంబంధించిన బ్రోచర్లను శనివారం దేవాలయ వ్యవస్థాపక వంశీయులు శ్రీకృష్ణ మాన్య పట్వారి ప్రహ్లాద రావు ఆధ్వర్యంలో విడుదల చేశారు. ఈ సందర్భంగా ప్రహ్లాదరావు మాట్లాడుతూ డిసెంబర్ 17 నుండి జనవరి ఒకటి వరకు జరిగే బ్రహ్మోత్సవాలలో 24న కళ్యాణోత్సవం , 25న తెప్పోత్సవం , 26న రథోత్సవం జరుగుతాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో దీరేంద్ర దాస్, రాఘవేంద్ర దాస్, మధుసూదనాచారి, రమేశ్, రవి, నాగరాజు శర్మ, చంద్రశేఖర్ రావు, వీరారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

